# వై.సి.వి. రెడ్డి సమగ్ర సాహిత్యం

# వై.సి.వి. రెడ్డి సమగ్ర సాహిత్యం

**ప్రథమ ముద్రణ** : 2004

**ద్వితీయ ముద్రణ** : మార్చి 2018

**వెల** : రూ. 300/-

**ముద్రణ** : **శివసాయి గ్రాఫిక్స్ & బైండింగ్స్**
రహమతుల్లా వీధి, కడప.
సెల్ : 9676525538.

సర్వహక్కులు ప్రకాశకులవే.

ISBN NUMBER : 978-93-5291-428-9

**ప్రచురణ** : వై. ప్రభాకరరెడ్డి
హెచ్–ఐ–జి – 222,
యస్.టి.యమ్. టౌన్‌షిప్,
రిమ్స్ దగ్గర, పుట్లంపల్లి
కడప జిల్లా – 516002

ఫోన్ : 8985545605

ఈమెయిల్ : umpr1984@gmail.com

# ఆకాంక్ష

భావితరాల వారికి వారసత్వంగా అందవలసిన సాహితీసంపదను సుసంపన్నం చేయడంలో భాగంగా 2004వ సంవత్సరంలో ఈ పుస్తకాన్ని ప్రచురించాము. 2004లో ముద్రించిన 1000 ప్రతులు ఆశించిన ఫలితాన్ని అందించి కొత్త చేర్పులతో ఈ ముద్రణకు దారితీసింది. ఈ 12 సంవత్సరాలు వై.సి.వి. రచనలు అనేక మందికి ప్రేరణ ఇచ్చాయి. ఎంతోమంది వాటిని తమ సంకలనాలలో పొందుపర్చారు, అనేక సందర్భాలలో ఉటంకించారు.

మొత్తం 10 రచనలపై శ్రీరామకృష్ణకవిగారు అనితరసాధ్యమైన రీతిలో పరిశోధనా వ్యాసాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పంకు సమర్పించి డాక్టరేటు పొందడం మా శ్రమకు మించిన పారితోషకం.

ఈ 12 సంవత్సరాలు మా కుటుంబాలలో అనేక మార్పులు – పిల్లలందరికీ వివాహాలు అయిపోయి వారు సంతానవంతులై సుఖంగా ఉన్నారు.

ఈ నేపథ్యంలో మరల మా నాయన రచనలు అనేక మార్పులు చేర్పులతో ముద్రించడం స్వాభావిక క్రియ తప్ప అన్యం కాదు. పుస్తక ముద్రణతో పాటు అంతర్జాలంలో మా నాయన పేరున WWW.YCVREDDY.COM వెబ్‌సైటును కూడా నిర్మించి అందరికీ అందుబాటులో ఉంచాము.

ఈ పుస్తకంలోని ప్రతి రచనకు పరిచయవాక్యాలు లేదా ముందుమాటలు ఉన్నాయి కాబట్టి మరలా మొత్తము పుస్తకానికి ముందుమాట అవసరములేదన్న పెద్దల మాటను పాటించి అలాగే ముద్రిస్తున్నాము.

ఈ పుస్తక ముద్రణలో, వెబ్‌సైట్ నిర్మాణంలో అన్ని విధాల సహకరించి, ప్రోత్సహించిన పెద్దలు, గౌరవనీయులు డా॥ కేతు విశ్వనాథరెడ్డిగారికి, యస్.సి. రామసుబ్బారెడ్డి గారికి, పొలిచర్ల సుబ్బారాయుడు గారికి, డా॥ శ్రీరామకృష్ణకవిగారికి, డా॥ యం. శివప్రవీణ్‌గారికి, శ్రీ వీరయ్యగారికి, శ్రీ ఇక్రం అలీఖాన్‌గారికి, శ్రీ జి. విజయభాస్కర్ రెడ్డిగారికి, యన్. సుబ్బారాయుడు గారికి (GUDDUZ technologies), వరికూటి ప్రశాంత్‌గారికి, పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దిన "శివసాయి గ్రాఫిక్స్" వారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

యమ్మనూరు ప్రతాప రెడ్డి
యమ్మనూరు ప్రభాకర్ రెడ్డి
మార్చి, 2018 — యమ్మనూరు పురుషోత్తమ రెడ్డి

# విషయసూచిక


ఆకాంక్ష 3

– వై. ప్రతాపరెడ్డి, వై. ప్రభాకరరెడ్డి, వై. పురుషోత్తమరెడ్డి

వై.సి.వి. రెడ్డిగారి జీవిత పరిచయం 5

– డా॥ వి.వి. భాస్కర పుల్లయ్య

1. తొలకరి చినుకులు 21

2. మేనక 67

3. రంభ 105

4. సిందూరరేఖ 133

5. దక్షిణానిలము 179

6. రాయబారము 205

7. సెలకన్నె 233

8. వైజయంతి 259

9. పారిజాతం 291

10. గట్టిగింజలు – కథలు 341

# వై.సి.వి. రెడ్డి జీవిత పరిచయం

**– డా॥ వి.వి. భాస్కర్ పుల్లయ్య,** M.A. M.Ed. M.Phil., Ph.D.

నాలాంటి ఎందరో యువకులకు ఉత్సాహాన్ని, స్ఫూర్తినిచ్చిన శ్రీ వై.సి.వి. రెడ్డిగారి జీవిత విశేషాలను పరిచయం చేయమని వారి కుమారులు నన్ను అడిగినపుడు నా తండ్రిగారైన వి. శేషాచార్యులు గారి ఆప్తమిత్రులు, నా ఉన్నత విద్యాభ్యాసానికి వెన్నుదన్నుగా నిలిచిన వై.సి.వి. రెడ్డిగారి ఋణం ఓపినంత తీర్చుకొనేందుకు ఇది ఒక గొప్ప సదవకాశంగా నేను భావించాను.

**"కడప గడపలలోన కవుల గడపలు మెండు"** అన్నారు వై.సి.వి. గారు.

రాయలసీమలోని కడప జిల్లాలో ఎందరో మహాకవులు, కవయిత్రులు, పండితులు, రచయిత్రులు జన్మించి తెలుగు భారతిని తమ సుగంధ పరిమళ కావ్యసుమాలతో అర్చించినారు. సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేరీతిలో వేల కీర్తనలు రచించిన పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య, ఆంధ్రకవితా పితామహుడు – మను చరిత్ర ప్రబంధకర్త అల్లసాని పెద్దన, తమ తత్త్వాలతో ప్రజల్ని మేల్కొల్పిన పోతులూరి వీరబ్రహ్మం, సిద్దయ్య గార్లు, నీతులను బూతులలో రంగరించి అందరికీ పంచిన కవి చౌడప్ప కడప జిల్లాకు చెందినవారే. ఇంకనూ ఆంధ్రా వాల్మీకి వావిలికొలను సుబ్బారావు, కళాప్రపూర్ణ జనమంచి శేషాద్రి శర్మ, కవిరత్న కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, వీరరసోచిత కావ్యమగు రాణాప్రతాప చరిత్ర కర్త దుర్భాక రాజశేఖర శతావధాని, శివభారత కావ్యకర్త గడియారం వేంకటశేషశాస్త్రి, శివతాండవము, జనప్రియ రామాయణాది కావ్యకర్త సరస్వతీపుత్ర – శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, మహాసేనోదయ ప్రబంధాది శతాధిక గ్రంథకర్త కొడవలూరి రామచంద్రరాజు, కొమఱ్ఱాజు సీతారామ కవి, హనుమనగుత్తి దేవదానం, సత్కవి నారు నాగనార్య, స్వప్నశీతాచలకర్త రాచమల్లు భైరవ కొండారెడ్డి, ఉప్పలపాటి వెంకట నరసయ్య మొదలైన వారంతా ఈ జిల్లాలోనే జన్మించి విశిష్టమైన రచనలనందించారు. అలాంటి ఈ జిల్లాలోనే జన్మించిన కవిశ్రేష్ఠుడు "ఎమ్మనూరు చిన్న వెంకటరెడ్డి".

సంప్రదాయ సాహితీ పునాదులపై నవసాహిత్య సౌధ నిర్మాణం గావించిన ఆధునిక ఆంధ్ర కవివరేణ్యులలో వై.సి.వి. రెడ్డిగారొకరు. కాలాన్ని బట్టి ఆధునికులైనా సాహిత్య ప్రక్రియలపరంగా పాత క్రొత్తల మేలు కలయికగా క్రొమ్మెరంగులు వెదజల్లినట్టి రాయలసీమ కవులలో ఆయనొకరు.

**జననం:**

కడపజిల్లాలోని పులివెందల తాలూకాకు చెందిన బోనాల గ్రామంలో లక్ష్మమ్మ, కొండారెడ్డి అను దంపతులకు 1926 మార్చి 26వ తేదీన చిన్న వెంకటరెడ్డి జన్మించారు. ఈయన ఆ దంపతులకు తృతీయ సంతానం. మొదటి సంతానం అబ్బాయి – పెద్ద వెంకటరెడ్డి, రెండవ సంతానం అమ్మాయి – లక్ష్మమ్మ. వీరి ఇంటిపేరు ఎమ్మనూరు. కొండారెడ్డి గారిది మధ్య తరగతి రైతు కుంటుంబం. ఆయన పెద్దగా చదువుకోలేదు. తెలుగు చదవటం, రాయటం మాత్రం వచ్చు. కొండారెడ్డిగారు సహృదయులని, దయగల వారని ప్రతీతి. వీరికి ఆంధ్ర మహాభారతమంటే మహాప్రీతి. ముఖ్యంగా నన్నయగారనువదించిన ఆది, సభా, ఆరణ్య పర్వాలలోని కొన్ని ఘట్టాలు వీరికి కంఠతా వచ్చేవట.

**విద్యాభ్యాసం:**

వై.సి.వి. రెడ్డిగారి విద్యాభ్యాసము చిన్నప్పటి నుండి అంత సజావుగా సాగినట్లు కానరాదు. ఆ రోజుల్లో వీరి స్వగ్రామమైన బోనాలలో వీధిబడి కూడా ఉండేది కాదు. అందువల్ల బాల్యంలో వీరి మొదటి గురువు వీరి తండ్రిగారే. తర్వాత కొండారెడ్డి గారు తన పిల్లల చదువుకోసం ప్రొద్దుటూరులోని ముక్తి రామేశ్వర వాస్తవ్యులైన కొడవులూరి రామచంద్రరాజు గారిని బోనాలకు పిలిపించారు. రాజుగారు భట్రాజ కులశ్రేష్ఠులు, మహాసేనోదయ ప్రబంధాది శతాధిక గ్రంథకర్తలు. 1937 నుంచి 1939 వరకు మూడు సంవత్సరాలపాటు చిన్నవెంకటరెడ్డి రామచంద్రరాజు గారి వద్ద శిష్యరికం చేసి ఆంధ్ర మహాభారతం, జైమినీ భారతం, కంకంటి పాపరాజుగారి ఉత్తర రామాయణాల్ని పాఠం చెప్పించుకున్నారు. అప్పుడే అమరం, ఆంధ్రనామ సంగ్రహం, సులక్షణసారం

వంటి గ్రంథాలను కంఠతా పట్టినారు. వై.సి.వి. రెడ్డిగారి అన్నగారైన పెద్ద వెంకటరెడ్డి తమ్ముడి కంటే 14 సంవత్సరాలు పెద్ద. ఈయనకు కూడా భారత భాగవతములతో మంచి పరిచయం ఉండేది. రామచంద్రరాజుగారి గురుత్వభాగ్యం వల్లనేమో వై.సి.వి. రెడ్డి గారికి బాల్యం నుంచే కవిత్వం చెప్పాలనే అభిలాష కలిగి కందంలోనూ, తేటగీతిలోనూ పద్యాలను చెప్పేవారు. అయితే అప్పటికి వీరికింకా ఛందస్సు, వ్యాకరణం, అలంకార ప్రయోగ మర్యాదలు అంతగా తెలియవు. ఇదిలా ఉండగా 1939వ సంవత్సరంలో సంక్రాంతి పండుగ దినాలలో వీరి తండ్రి కొండారెడ్డి గారు స్వర్గస్థులైనారు. అందువల్ల వీరి  చదువు తాత్కాలికంగా కుంటుపడింది. 1940 నుంచి 1942 వరకు మూడు సంవత్సరాల పాటు వీరు తమ అన్నగారైన పెద్ద వెంకటరెడ్డి గారితో పొలం పనులకు పోతూ ఉండేవారు. వై.సి.వి. రెడ్డిగారికి ఇంగ్లీషు చదువుకోవాలని అభిలాష కలిగింది. అన్నగారికి ఇష్టం లేకపోయినా తమ్ముడికి ఇంగ్లీషు చదువు చెప్పించాలనుకున్నారు. బోనాల గ్రామానికి చెందినవాడు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడైన చిప్పల పెద్ద రామన్నగారు అనంతపురం జిల్లాలోని గుత్తిలో ఉండేవారు. ఇంగ్లీషు చదువు చెప్పించుకొనే దానికి వై.సి.వి. రెడ్డిగారు గుత్తికి వెళ్ళి ఆయన వద్ద ఉన్నారు. అప్పటికి ఆయనకు 17 ఏళ్ళు. అక్కడ ఆర్. వీరయ్య, జయదేవశర్మ గార్లతో ప్రైవేట్ చెప్పించుకుని హైస్కూల్లో 1944లో థర్డ్ ఫారమ్ చేరాలని వై.సి.వి. రెడ్డిగారి సంకల్పం. కాని,  ఆ రోజుల్లో గుత్తిలో జి. కృష్ణమూర్తి, బి.ఏ. గారికి బాగా ట్యూషన్ చెప్తారని పేరుండేది. అందువల్ల ఆయన వద్దే వై.సి.వి. గారు ట్యూషను చేరారు. ఆయన వై.సి.వి. గారి గ్రహణశక్తి, చురుకుదనాన్ని చూసి ఏకంగా మెట్రిక్యులేషన్‌కు ప్రైవేట్‌గా కట్టి పరీక్ష రాయవచ్చునన్నారు. దాంతో వై.సి.వి. రెడ్డిగారు మెట్రిక్యులేషన్ పరీక్షకు ప్రైవేట్‌గా కట్టారు. శ్రీయుతులు వీరయ్య, జయదేవశర్మ, కృష్ణమూర్తి, గుండూరావులు ప్రైవేట్ చెప్పగా 1946 మార్చికి మద్రాస్ మెట్రిక్యులేషన్‌కు గాను బెంగుళూరుకు సెంటరు వేసుకుని పరీక్ష రాశారు. కానీ ఇంగ్లీషు మీడియం అవ్వడం వల్లనైతేనేమి, మొదటి దఫా పబ్లిక్ పరీక్షలు రాయవలసి

రావడంవల్లనైతేనేమి వై.సి.వి. రెడ్డిగారు పరీక్ష తప్పారు. కానీ మరుసటి సంవత్సరం అనగా 1946–47లో మద్రాసులోని సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషనల్ ట్యుటోరియల్ కాలేజీలో చేరి శ్రద్ధగా చదివి పరీక్ష ఉత్తీర్ణులైనారు. తర్వాత ఇంటర్మీడియట్ చదవాలనుకొని అప్పటికే కడపలో ప్రారంభించబడిన ప్రభుత్వ కళాశాలలో చేరారు.

**వివాహం – ఉద్యోగయత్నం:**

పెద్దలు వై.సి.వి. రెడ్డిగారికి వివాహం చేయదలిచారు. కడపజిల్లా వీరపునాయునిపల్లె మండలం, ఎరమలపల్లె వాస్తవ్యులైన శ్రీ ఆదినారాయణరెడ్డి చెన్నమ్మగార్ల కుమార్తె బాల చెన్నమ్మతో వీరికి 1947 జూన్ 15వ తేదీన వివాహం అయింది. తర్వాత చదువు సరిగా సాగలేదు. ఇంతలో అన్నగారు ఆస్తి పంపకాలు జరిపి వేరైనారు. తప్పనిసరి పరిస్థితులలో మామగారి సలహా మేరకు ఉద్యోగ ప్రయత్నం చేశారు. అది ఫలించి 1949 అక్టోబర్ 13వ తేదీన కడపజిల్లా బోర్డులో గుమాస్తాగా చేరారు.

**సాహిత్యాభిలాష – పలువురు సాహితీశ్రేష్ఠుల పరిచయాలు – రచనా వ్యాసంగం:**

కొడవలూరి రామచంద్రరాజుగారి వద్ద చదువుకునేటప్పుడే ఈయనకు సాహిత్యాభిలాష కలిగిందని ముందే విన్నవించడం జరిగింది. అలాగే ఇంగ్లీషు చదువుకునే దానికి వెళ్ళి గుత్తిలోనున్న రోజుల్లో పూజ్యులు చక్రాల నరసింహశాస్త్రి గారి సాహచర్యం లభించింది. ఆయన గొప్పకవి, బహుముఖ ప్రజ్ఞాశాలి, మయూర ధ్వజోపాఖ్యానకర్త. వీరి వద్ద రెడ్డిగారు ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం నేర్చుకున్నారు. శాస్త్రిగారు రెడ్డిగారిలోని కవితా ధారాధోరణిని చూసి మెచ్చుకుని అతనిచే ఒకసారి అష్టావధానం కూడా చేయించారు. వారి సాహచర్యం వల్ల రెడ్డిగారు రెండు మూడు సార్లు అవధానాలు చేశారు. కానీ ఆ ప్రక్రియ పట్ల తనకు అంత అసక్తిలేని కారణంగా తర్వాత మానివేశారు. అప్పట్లోనే అనంతపురం జిల్లా కలెక్టర్‌గా ఉండిన టి.యస్. రామచంద్రన్, ఐ.ఎ.యస్. గారు ఒక పరిశ్రమ ప్రారంభోత్సవానికి గాను గుత్తికి వచ్చిన

సందర్భంలో స్వాగత పద్యం రాయవలసినదిగా శాస్త్రిగారు రెడ్డిగారిని ఆదేశించారు. అప్పుడే వై.సి.వి. రెడ్డిగారు కందంలో అందంగా రాసిన ఆ స్వాగత పద్యమిది.

"శ్రీప్రక్దరుండు సజ్జన
విస్రబ్ధ దయామయుండు విష్ణువు కృప టీ
యస్రారు చంద్ర ఘనునియ
జస్రముభావింతు సద్విచారునిగాగన్"

అక్కడున్న రోజుల్లోనే వై.సి.వి. రెడ్డిగారు 'గుత్తి చరిత్ర' అన్న పేరుతో కావ్యరచన ప్రారంభించి, తర్వాత ఎందుకో వదిలివేశారు.

అటు తర్వాత 1948వ సంవత్సరంలో కడప నుంచి వెలువడుతున్న 'అజాద్ హింద్' వారపత్రికలోనూ, కర్నూలు నుంచి వెలువడుతున్న 'జ్వాలా' పత్రికలోనూ రెడ్డిగారి కవితా ఖండికలు కొన్ని వెలువడినాయి.

రెడ్డిగారికి ఆంగ్ల సాహిత్యంతో పెద్దగా పరిచయం లేదు. అయితే ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో 'వర్డ్సవర్త్' కవిత్వమంటే బాగా ఇష్టపడేవాడు. 'వర్డ్సవర్త్' ను 'గోల్డన్ బీ ఇన్‌ది లిల్లీక్రెడిల్'గా గుర్తించినారు.

ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లోనే కడప మండల కవులయిన గడియారం వేంకటశేష శాస్త్రిగారితోనూ, సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు గారితోనూ, దర్భాక రాజశేఖర శతావధాని గారితోనూ వీరికి పరిచయం కలిగింది. వై.సి.వి. రెడ్డిగారికి ఉద్యోగ రీత్యా రైల్వే కోడూరుకు బదిలీ అయినప్పుడు సత్కవి నారునాగనార్యతోనూ, ఉప్పలపాటి వేంకట నరసయ్యతోనూ, వేదం వేంకటకృష్ణశర్మతోనూ పరిచయం కలిగింది. వీరి ప్రోత్సహంతోనే 1950కి ముందు అప్పుడప్పుడూ రాసిన కవితా ఖండికలన్నీ కూర్చి 'తొలకరి చినుకులు' అన్న పేరుతో ముద్రించడం జరిగింది. ఇది రెడ్డిగారి తొలి రచన. నారునాగనార్యకు అంకితం ఇవ్వబడింది.

1950–51లో రెడ్డిగారు "మేనక" అనే చిన్న కావ్యం రచించారు. ఇది రెడ్డిగారి ద్వితీయ రచన. కట్టమంచి రామలింగారెడ్డికి అంకితం ఇచ్చారు. 1954లో ముద్రించబడింది. రెడ్డిగారి తృతీయ రచన "రంభ". ఈ కావ్యం 1957లో ముద్రితమైంది. దీని కళాప్రపూర్ణ బళ్ళారి రాఘవాచార్యులకు

అంకితమిచ్చారు. ఈ కావ్యంలోని నిర్మాణ కౌశలాన్ని మెచ్చుకొని నారునాగనార్య గారు క్రింది పద్యంతో రెడ్డిగారిని ప్రశంసించారు.

"కనుగొంటిన్ చెలికాడ నీ కవిత గంగాభంగ రంగత్తరం
గనిషం గోజ్వల సంగతాంగి విలసత్కం జాత సంజాత చి
త్కణ మాధుర్య సుధామధు ద్రవరతా కాంక్షమితోద్వేగవ
జ్జని తానందలురద్భ్రమద్భ్రమర కృత్ ఝుంకార తుల్యాకృతిన్"

వీరి ప్రథమ గేయకృతి "దక్షిణానిలము". దీన్ని రెడ్డిగారు తమ తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. తర్వాత రెడ్డిగారు కొంతకాలం 'వాధూల' అన్న మహర్షి పేరును కలం పేరుగా చేసుకొని చిన్న చిన్న వ్యాసాలను "రాయబారం" అనే గేయకావ్యాన్ని రాసి 'ఉపాధ్యాయ' పత్రికలో ప్రచురించారు. అసలు పేరుతోనే తర్వాతి కాలంలో రచనలు సాగించారు. అన్నార్థుడైన గాసగానికి రాయబారమనే తన ద్వితీయ గేయ రచనను అంకితమిచ్చారు. 1960లో "దక్షిణానిలము", "రాయబారం" ముద్రణకు నోచుకున్నాయి.

1968 ఏప్రిల్ నుంచి 1969 అక్టోబర్ మధ్య రాచమల్లు రామచంద్రారెడ్డిగారి సంపాదకీయంలో కడపలోని యుగసాహితీ తరపున "సంవేదన" అనే త్రైమాసిక సాహిత్య పత్రిక ఏడు సంచికలు వెలువడింది. ఈ పత్రికకు వై.సి.వి. రెడ్డిగారు ప్రచురణ కర్తగా వ్యవహరించారు.

తర్వాత రెడ్డిగారి కలం నుండి జాలువారిన మరొక మహత్తర గేయకావ్యం "సెలకన్నె". దీన్ని రెడ్డిగారు తన గురువర్యులు కొడవలూరి రామచంద్రరాజు గారికి అంకితమిచ్చారు. ఇది 1972లో ముద్రితమైంది. దీని తర్వాత మానవతా పూరిత, నవ కవితాత్మక వ్యాఖ్యానంగా, భావుక ప్రవరాఖ్యంగా భాసిల్లునట్టి మరొక గేయకావ్యాన్ని రెడ్డిగారు రచించి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల గారికి అంకితమిచ్చారు. అదే "వైజయంతి". ఇది 1977లో ముద్రితమైంది.

ప్రగతిశీల భావాలకు పదను పెట్టేందుకు కలిసి రావాలని రచయితలకు విజ్ఞప్తి చేస్తూ రెడ్డిగారు రచించిన మరొక అద్భుత గేయకావ్యం "పారిజాతం". దీన్ని గొప్ప మానవతావాది, స్వాతంత్ర సమరయోధుడు అయిన దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి గారికి అంకితమివ్వడం జరిగింది. ఇది 1978లో ముద్రితమైంది.

రెడ్డిగారికి కడపజిల్లా సి.పి.ఐ. నాయకులైన ఎద్దుల ఈశ్వరరెడ్డి, ఎన్. శివరామిరెడ్డి, గజ్జల మల్లారెడ్డిగార్లతోనూ, సొదుం జయరాం, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతువిశ్వనాథరెడ్డి వంటి వారితోనూ పరిచయాలు ఏర్పడి ఉండటంవల్ల వీరు ఇటు మార్క్సిస్టు సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయడమే కాకుండా, అటు వచనరచనపై కూడా ఆసక్తిని పెంచుకున్నారు. ఆంగ్ల సాహిత్యంలోని చిన్నచిన్న కథల్ని, అవి రాయడానికి కావల్సిన మెళకువల్ని తన మిత్రులతో విస్తారంగా చర్చించేవారు. ఆ ఉత్సాహము, ప్రేరణలతో తనకు బాగా పరిచయమున్న, తన హృదయాన్ని కదిలించి వేసిన అనేకమంది పేదరైతుల కడగండ్లను కథారూపంలో చిత్రించారు. వాటిని ఆనాటి ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, కొత్తబాట వంటి ప్రముఖ పత్రికలు ప్రచురించాయి. ఇలా వివిధ సందర్భాల్లో, వివిధ పత్రికల్లో ప్రచురించబడిన కథలన్నింటినీ ఒక సంపుటిగా 1982లో "గట్టిగింజలు" అన్న పేరుతో అచ్చువేయడం జరిగింది. ఇందులో 21 కథలున్నాయి. రైతుకూలీలు ఒక సంఘటిత శక్తిగా రూపొందితేనే సమస్యలకు పరిష్కారమార్గం దొరుకుతుందన్న తపన ఈ కథల్లో చాలామటుకు కనిపిస్తుంది. 1982లోనే రెడ్డిగారు "సిందూరరేఖ" అనే పద్యకావ్యాన్ని కూడా రాసి తన అన్నగారికి అంకితమిచ్చారు. ఇది ప్రస్తుత సంకలనంలో తొలిసారిగా ముద్రించబడుతోంది. మిగిలిన రచనలన్నీ ద్వితీయ, తృతీయ ముద్రణలకు నోచుకున్నాయి.

ఇలా వై.సి.వి. రెడ్డిగారు తొలుత ప్రాచీన సాంప్రదాయాలకు అనుగుణంగా రచనలు సాగించి, పిమ్మట భావకవిగానూ, అభ్యుదయ కవిగానూ పరివర్తన చెందారు. ఈయన 1972 నుంచి కడపజిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షునిగా ఆమరణాంతమూ విశిష్ట సేవలందించారు. ఆ మహామహుడు, నిగర్వి, నిరాడంబరుడు, సాహితీపిపాసి. 1989 అక్టోబర్ 8వ తేదీన కడపలో మున్సిపల్ హైస్కూల్ లోని నెహ్రూ ఆడిటోరియంలో జరుగుతున్న అరసం సభలలో పాల్గొంటూ మధ్యాహ్నవేళ భోజనానంతరం హఠాత్తుగా గుండెపోటు రావడంతో అనేకమంది సాహితీ మిత్రులనూ, అభిమానులనూ శోకసముద్రంలో ముంచి తనువు చాలించారు. నేటికీ

భౌతికంగా వారు లేకున్నా సాహితీ మిత్రుల, అభిమానుల హృదయాల్లో ధృవతారగా వెలుగొందుతూనే ఉన్నారు. ఉంటారు కూడా.

**వై.సి.వి. రెడ్డిగారి కుటుంబ విశేషాలు:**

యమ్మనూరు చిన్నవెంకటరెడ్డి, బాలచెన్నమ్మ దంపతుల సంతానం నలుగురు. ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు.

వీరిలో కుమార్తె శకుంతల అందరికన్నా పెద్దది. ఈమెకు పులివెందుల తాలూకా లాయలాపురం గ్రామ నివాసియైన నంది రామిరెడ్డిగారి కుమారుడైన నాగారెడ్డిగారితో వివాహం అయింది. శ్రీ నాగారెడ్డిగారు మైసూరులోని రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ గావించారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు దివాకర్. హైదరాబాదులో అశోక్ లేలాండ్ సంస్థలో మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని భార్య సౌజన్య. కుమారుడు నితేష్. ఇక నాగారెడ్డి గారి రెండవ కుమారుడు మధుకర్. ఈ అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో పనిచేస్తున్నాడు. ఇతని భార్య శాంతి, కుమార్తె శర్వాణి.

వై.సి.వి. రెడ్డిగారి రెండవ సంతానం వై. ప్రతాప్‌రెడ్డి. ఈయనకు కడపజిల్లా కమలాపురం తాలూకా ఎరమలపల్లె గ్రామ వాస్తవ్యులైన బాలిరెడ్డి, రామలక్ష్మమ్మల కూతురైన తులశమ్మతో వివాహం జరిగింది. శ్రీ ప్రతాపరెడ్డిగారు ఎస్.ఇ. గా సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో తిరుపతిలో పదవీ విరమణ చేశారు. ఈ దంపతులకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు రజనీకాంత్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఇతని భార్య సింధు, కుమారుడు ధీమంత్, కుమార్తె దియా. రెండవవాడు నళినీకాంత్. లండన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని భార్య విజయక్ష్మి. కుమారులు తన్మయ్, అనయ్.

వై.సి.వి. రెడ్డిగారి మూడవ సంతానం వై. ప్రభాకర్‌రెడ్డి. ఈయనకు కడపజిల్లా, పులివెందుల తాలూకా, గోటూరు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, పెద్దరెడ్డెమ్మ దంపతుల కుమార్తెయగు ఉమామహేశ్వరితో వివాహమైంది.

శ్రీ ప్రభాకర్‌రెడ్డిగారు హిస్టరీ లెక్చరర్‌గా కడపజిల్లా ఖాజీపేటలోని ఆర్.ఇ.ఎస్.ఎస్.వి. జూనియర్ కళాశాలలో పనిచేసి, పదవీ విరమణ చేసారు. శ్రీమతి ఉమామహేశ్వరి గారు అడపూర్ (నందలూరు)లోని సోషియల్ వెల్‌ఫేర్ స్కూలు నందు టి.జి.టి. (హిందీ) ఉద్యోగం చేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు మగపిల్లలు. పెద్దవాడు విభాకర్ సివిల్ ఇంజనీర్ గా అబుదాబిలో పనిచేస్తున్నాడు. ఇతని భార్య స్వాతి, కుమార్తెలు చొహార, విహసిత. చిన్నవాడు దినకర్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉన్నారు. ఇతని భార్య సుప్రజ, కుమార్తె సాత్విక.

వై.సి.వి. రెడ్డిగారి నాల్గవ సంతానం వై. పురుషోత్తమరెడ్డి. ఈయనకు కడపజిల్లా అనిమెల గ్రామ వాస్తవ్యులైన సోమనారపురెడ్డి, శేషమ్మగార్ల కుమార్తెయైన పద్మావతితో వివాహమైంది. శ్రీ పురుషోత్తమరెడ్డిగారు అనంతపురం ప్రభుత్వం కళాశాలలో మాథ్స్ లెక్చరర్‌గా పని చేయుచున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి మనోజ్ఞ భర్త ప్రదీప్‌రెడ్డి. డి.ఆర్.డి.ఓ., బెంగళూరులో సైంటిస్ట్. వీరి కుమార్తెలు శ్రద్ధ, శ్రేష్ఠ. చిన్నమ్మాయి అభిజ్ఞ. భర్త శివజ్యోత్‌రెడ్డి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. వీరి కుమారుడు ధార్మిక్‌రెడ్డి.

**వై.సి.వి. రెడ్డిగారికి జరిగిన సన్మానాలు – సత్కారాలు:**

వై.సి.వి. రెడ్డిగారు ఉపజ్ఞ, ఊహ, ఉత్సాహం, ఉద్వేగం గల కవిపుంగవులు, అపూర్వ భావనా బలసంపన్నులు, వినయ వివేక సంపన్నులు, సరసులు, దయార్ద్ర హృదయులు, మానవతావాది, స్నేహశీలి, శ్రమైకజీవి, గుణగ్రహణ పారీణులు, గంభీర స్వభావులు. ఆయన బహుముఖ ప్రజ్ఞాపాటవాల్ని గుర్తించి, ఆయనను సత్కరించి తమను తాము సత్కరించుకున్నంతగా సంతృప్తి చెందారు, అనేకమంది సాహితి ప్రముఖులు, మిత్రులు, అభిమానులు. వారికి జరిగిన సత్కారాలు:

1. 1958–59 సంవత్సరాలలో కడపజిల్లా, సింహాద్రిపురం పురజనుల కోరిక మేరకు ఆంధ్రమహాభారతం, రంగనాథ రామాయణాలను పూర్తిగా చదివి

వివరించినప్పుడు వెన్నపూస శివనారాయణ రెడ్డిగారి ఆధ్వర్యంలో రెడ్డిగారిని, వారి కుటుంబ సభ్యుల్ని కూడా ఘనంగా సత్కరించడం జరిగింది.

2. ప్రొద్దుటూరులో గడియారం వేంకటశేషశాస్త్రిగారి అధ్యక్షతన జరిగిన సభలో రెడ్డిగారు, "రంభ" అనే ఖండకావ్యాన్ని శ్రావ్యంగా చదివి వినిపించినప్పుడు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులగారి సముఖంలో వీరికి ఘనంగా సన్మానం జరిగింది.

3. ప్రొద్దుటూరు తాలూకా కొర్రపాడు గ్రామంలో రైతు మహాసభలు జరుగుతున్నప్పుడు ఐ. సుబ్బారెడ్డిగారి అధ్యక్షతన గజ్జల మల్లారెడ్డి సమక్షంలో వై.సి.వి. రెడ్డిగారికి ఘనంగా సన్మానం జరిగింది. నాటి సభలో మల్లారెడ్డిగారు వై.సి.వి. గారికి జోహారులు అర్పించి "ప్రజాకవి"గా ప్రస్తుతించినారు.

4. 1960వ సంవత్సరంలో బద్వేల్ పురజనులు విద్వాన్ విశ్వంగారి అధ్యక్షతన గొప్ప సభలు జరిపి శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు గారిని, ప్రజాకవి వై.సి.వి. రెడ్డిగారిని సంస్కృత పండితులు జంఘా నరశింహశాస్త్రి గారిని ఘనంగా సన్మానించారు.

5. 1961లో గుంటూరులో సి.వి.ఎన్.ధన్‌గారి అధ్యక్షతన వై.సి.వి. రెడ్డిగారికి, గజ్జల మల్లారెడ్డిగారికి సన్మానాలు జరిగాయి.

6. 1964 సంగమేశ్వర దేవాలయంలో శ్రీమాన్ పుట్టపర్తి వారి అధ్యక్షతన జరిగిన సభలో ఆహ్వాన సంఘాధ్యక్షులైన నర్రెడ్డి శంభురెడ్డిగారు వై.సి.వి. రెడ్డిగారిని సువర్ణ కంకణంతో ఘనంగా సత్కరించారు. ఆనాటి సన్మానసభకు అప్పటి రాజ్యసభ సభ్యులు వై. ఆదినారాయణరెడ్డి గారు, జిల్లాలోని ఎం.పి.లు, ఎం.ఎల్.ఏ.లు, సమితి ప్రెసిడెంట్లు, పురప్రజలు అంతా కలిసి 15 వేలమంది దాకా హాజరైనారు. ఆ సన్మానం రెడ్డిగారి జీవితంలో ఒక మరుపురాని మధురమైన ఘట్టం.

7. కడప ఆర్ట్స్ కాలేజీలో కవి సమ్మేళన సందర్భంలోనూ, కళాశాల వార్షిక దినోత్సవ సందర్భంలోనూ అప్పటి ప్రిన్సిపాల్ ఎం.ఎస్. శాస్త్రిగారు రెడ్డిగారిని ఘనంగా సత్కరించారు. కడప పురుపాలక సంఘ ఓపన్ ఎయిర్ థియేటర్‌లో ఎన్. రామప్పనాయుడు గారి అధ్యక్షతన రెడ్డిగారికి ఘనసన్మానం జరిగింది. మైదుకూరు, కొండాపురం, రైల్వేకోడూరు, నందిమండలం, చెన్నూరు హైస్కూళ్లలోనూ, రాయచోటి ట్రైనింగ్ స్కూళ్ళలోనూ రెడ్డిగారికి సన్మానాలు జరిగాయి. కడపజిల్లా పంచాయితీరాజ్ ఎంప్లాయిస్ యూనియన్ వారు కూడా రెడ్డిగారిని సన్మానించారు. పులివెందుల తాలూకా నల్లపరెడ్డిపల్లె, కమలాపురం తాలూకా పాయసం పల్లె పురజనులు కూడా రెడ్డిగారిని సన్మానించారు. అనంతపురం జిల్లా ఇంజనీరింగ్ కాలేజివారు, ముద్దనూరు సాహితీ సంఘంవారు కూడా రెడ్డిగారిని సత్కరించారు.

8. 1984 డిసెంబర్ 13-14 తేదీల్లో కడపజిల్లా అ.ర.సం. వారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.ఎన్.రెడ్డి గారి అధ్యక్షతన రెడ్డిగారిని ఘనంగా సత్కరించారు.

9. 1984 ఏప్రిల్ ఉగాది పర్వదినాన తెలుగు విశ్వవిద్యాలయం వారు హైదరాబాదులోని రవీంద్రభారతిలో కవి సమ్మేళనం జరిపారు. ఆ సందర్భంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీయుతులు యన్.టి. రామారావుగారు రెడ్డిగారిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

ఇలా అనేక సందర్భాల్లో వై.సి.వి. రెడ్డిగారు సాహితీ మిత్రుల, ప్రముఖుల, అభిమానుల సన్మాన సత్కారాలను పొందినారు.

వై.సి.వి. రెడ్డిగారి రచనలపై, వ్యక్తిత్వంపై పలువురు సాహితీ ప్రముఖుల, మిత్రుల అభిప్రాయాలు:

నీతియుతుండునున్ కవియు నిర్మల చిత్తుడుదాత్తుడాత్త వా
ణీతరుణీ కటాక్షుడవి నిందిత శబ్ద రసౌచితీ కళో

పేతుడు ఎమ్మనూరు చిన వెంకటరెడ్డికి మాదు స్నేహము
ద్రాతి మనోహరత్వమెగదట్టగ నంకితమిచ్చితీకృతిన్

**- రాచమల్లు భైరవ కొండారెడ్డి**

ఉప్పమ్మి రత్న వర్గపు
గుప్పలు సవరించి దాచుకొనిన కృపణుచే
నప్పుగొని కవులకిచ్చును
తప్పక ఋణదాత కిచ్చు cదానేమగునో!

ఏమగు లోక హితార్థము
గా మను శశి cబోలె నితడు గ్రమ్మలు ద్విగుణ
శ్రీ మహిమన్ ధన సస్య
శ్యామల గావించు వృష్టి సంతర్పణలన్

**- ఉప్పలపాటి వేంకటనరసయ్య (1962)**

అనగా! చల్లనికైతవాడ! నొకనాడైనన్ మదీయోప కా
ర నిరీక్షామతినుంటివో! సతము నా వ్రాతల్ ప్రశంసించుటే
పని మాధ్వీకరాసాను మేయమతి ఓ వై.సీ.వి. రెడ్డీ! భవ
జ్జని నామేలునకయ్యె, నిన్ను మరువన్ జాలన్ దివారాత్రముల్

**- డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు (3.5.77)**

# వైసివీ రెడ్డిగారూ!

మీరిక లేరని చదివి

అక్షరాలు అలుక్కుపోయాయి.

హైదరాబాద్ రోడ్లన్నీ

కడపపట్టణ వీధులై అంతటా మీరే కనపడుతున్నారు.

ఆ మధ్య వచ్చినప్పుడే

కాస్త మెత్తగా కనపడ్డారు.

కళ్ళద్దాల మందాల్లోంచి

చూపులు చెదిరిపోతూ రాలిపడ్డాయి.

అయినా అంతలోనే

మరణం మిమ్మల్ని హరిస్తుందనుకోలేదు.

ఉద్యమ, సాహిత్య లోకాల్లో

ఓ సురుచిరతార రాలుతుందనుకోలేదు.

కడప అంటే మాకు పుట్టపర్తి, మీరే

కడప అంటే మాకు

పద్యాలూ, ప్రగతి వాద్యాలూనూ

ప్రబంధ దీపాలను

పల్లెయాసతో మీరు వెలిగిస్తుంటే చూడాలి

పద్యాలను మీరు అల్లితే వినాలి

రసమంటే ఏమిటో

మీ సన్నిధిని కూచొని గుటకలు మింగాలి

రాయలసీమలో నీళ్ళులేక
పక్కవాడు పగవాడవుతున్నాడని
బొటబొటా కన్నీళ్ళు కురిసే మానవీయమూర్తి మీరు
కక్షలకు లక్షలు తగలేస్తున్నారని వాపోయేవారు
పిల్లకాయల్నివెంటేసుకుని
కవిత్వం ఓనమాలు దిద్దిస్తూ
ఏడుతోవల వెంటతిరిగే నిత్యసాహిత్య పథికులు మీరు.
రాయలసీమ యాస మీ నాల్కపై మట్టివాసన వెదజల్లేది.
కుటుంబ జీవనం మీ అంగీకింద బనీను.
కవితోద్యమాలు మీ భుజం మీది రుమాలు.
కవిత్వమంటే మీకు
'అమృతం కుండకు చిల్లిపడితే జారేధార'
ప్రజల కష్టాలంటే
గుండెల్లో మొలిచే ఉద్వేగ కులిశధార
మా పిల్లలు వైసీవీ తాతను గుర్తు చేస్తున్నారు.
మీ ఇంట్లో జొన్న రొట్టెలు నాకింకా జ్ఞాపకం
మక్దూంభవన్‌కు ఫోను చేస్తే మీరింక పలకరు
హిమాయత్‌నగర్ రోడ్లమీద మీరిక కనపడరు.
అయినా మీరిక లేరంటే
అంతటా మీరే కనపడుతున్నారు.

**– డా॥ ఎన్. గోపి**

"ఆయన సన్నిహితులకు వై.సి.వి. వయసుతో పనిలేని, వయస్సు జ్ఞాపకం రాని సకల జగన్మిత్రుడు వై.సి.వి. పుట్టపర్తిలాంటి పెద్దలు మొదలుకొని, రాచమల్లు రామచంద్రారెడ్డి, గజ్జల మల్లారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శివరామిరెడ్డిలాంటి సహచరుల నుంచి, జానుమద్ది హనుమచ్ఛాస్త్రి, డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి, తదితర సాహితీ మిత్రుల నుంచి, అప్పుడప్పుడే రచనా, రాజకీయాలు నేర్చుకుంటున్న పిల్లకవులూ, కార్యకర్తల వరకు అందరికీ ఆ మనిషి సన్నిహితుడే. రాజకీయంగా ఎప్పుడూ కమ్యూనిష్టులకు ప్రత్యర్థిగా ఉండే 'మాసీమ' రాజగోపాలరెడ్డి కూడా ఆయప్పకు శత్రువు కాదు.

"ఎప్పుడన్నా పూటగడవని పరిస్థితి ఏర్పడి అప్పు పెట్టే అప్పకోసం వెతుక్కుంటూ వెళుతున్నప్పుడు కూడా దారిలో ఏ కవో కనిపించి ఎప్పుడో వచ్చి తన రచన వినిపించాలనుకుంటున్నట్టు సూచిస్తే చాలు. 'పా... ఇంటికి పోదాం' అని తీస్కెళ్ళి ఆ పూట కవిత్వ భోజనంతో గడిపే మనిషి వై.సి.వి. సాధారణంగా కవులకూ, రచయితలకూ తమ రచనలు వినిపించాలన్న ఉబలాటం ఉన్నంతగా ఇతరుల రచనల్ని వినాలని ఉండదు. వినడమే కాదు, వై.సి.వి. వంటి శ్రోత, ప్రోత్సాహకుడు వాళ్ళకు మరెక్కడా దొరకడు. పఠనంలో తనను కదిలించిన సందర్భం నిజంగా ఉంటే ఆ మనిషి భావోద్వేగంతో కన్నీళ్ళు పెట్టుకకుంటాడు. ఈ లక్షణం మనకు కాళోజీలో కనిపిస్తుంది.

"ఏమైనా తన రచనలకన్నా తనే అపురూపమైన మనిషి! గొప్ప రచనలు చేసిన వ్యక్తి వెళ్ళిపోతే రచనలుంటాయి. కనుక అదంత నష్టమనిపించదు. వ్యక్తికన్నా ఆ వ్యక్తి రచనలు విలువైనవి కావడం సాధారణ విషయం. వై.సి.వి. విషయం అలాంటిది కాదు. మనిషిని ప్రేమించేవాడు. మనిషి ప్రేమించదగినవాడు. కాదు ప్రేమించి తీరవలసినవాడు. వై.సి.వి. అంటే మనిషితనం, పల్లెటూరితనం, రాయలసీమ తనం".

**- పి. రామకృష్ణారెడ్డి**

(ఆంధ్రజ్యోతి 27-10-89 వారపత్రికలో)



**సంవేదన సాహిత్య త్రైమాసిక పత్రిక అవిష్కరణ - కడప : 30 మార్చి 1968**

ఎడమ నుంచి కూర్చున్నవారు: 1. రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.), 2. ప్రొ॥ జి.యన్. రెడ్డి, 3. పుట్టపర్తి నారాయణాచార్యులు, 4. శ్రీశ్రీ, 5. కొడవటిగంటి కుటుంబరావు, 6. గజ్జెల మల్లారెడ్డి, 7. వై.సి.వి.రెడ్డి

నిల్చున్నవారు: 1. ఆర్వియార్, 2. ఐ.సుబ్బారెడ్డి, 3. టి.సాంబశివారెడ్డి, 4. వేలూరి సోమయాజులు, 5. కేతు విశ్వనాథరెడ్డి, 6. నల్లపాటి రామప్పనాయుడు, 7. వి.రామకృష్ణ, 8. చవ్వా చంద్రశేఖర్‌రెడ్డి (సి.సి.రెడ్డి), 9. టి.చెన్నారెడ్డి, 10. సొదుం జయరాం

# తొలకరి చినుకులు

# అంకితము

**పండిత నారు నాగనార్య గారికి**

గీ॥ హృదయ పద్మాకరంబున బొదలు భావ
కమలముల నేటి మీపద కమలములకు
బూజ గావింతు సద్భక్తి బూజనీయ
స్వీకరింపుము సద్యశశ్రీ వెలుంగ

# కృతిపతి ఆశీర్వాదములు

ఉ॥ నేనొక శ్రీకుమారుఁడని నెమ్మదినెంచెనొ! ప్రాజ్ఞలోకమున్
జేనెలఁ గొల్పువాఁడని, గణించెనొ? సత్కవి కీర్తి దిక్కులన్
రాణఁ దలిర్చు వాఁడని, మనం బలరించెనొ? యేమొ, కానిచో
నీ నవకావ్యకన్య వలపించునె? నన్వలవం దలంచునే?

శా॥ ఔరా! యేమిది బేలకానియెడ నిట్లౌనే! వరాన్వేషణ
శ్రీరాపాడి, గతోద్యమాభిరతు వాంఛింపం దలంపేల? నౌ
నౌ! రామల్ హృదాయాభిరామలు కదా యవ్వారి లక్ష్యంబెవి
ద్వారంభాదుల కాట వట్టగుట నన్నర్థించె నంచెంచెదన్

గీ॥ నేను బ్రదుకుట లోక కళ్యాణమునకె
కాన; నాతోడు నీడవై కదలిరమ్మ
మేలు గీళ్లను నీకు సాఁ బాలుఁ గలదు
తెలుఁగు నర్చింపు మిదె మహోజ్జ్వల చరిత్ర!

గీ॥ కావ్యకన్యకుఁ దత్కృతి కర్త కెప్పు
డాయు రారోగ్య భోగ భాగ్యాభివృద్ధి
పరమపిత కూర్చునను నొక్క పలుకుఁ దక్క
కృతిపతి మరేమి కూర్చు దీవింప నేర్చు

# పీఠిక

శ్రీ చిరంజీవి ఎమ్మనూరు చిన్న వేంకటరెడ్డితో నాకుఁ గల పరిచితి కడచిన రెండు మూఁడేండ్ల నాఁటిది. మొదటి దినములలోనే, అతనికి గల సారస్వతాభిలాష, కవితాభిరుచి నా కవగతములైనవి. యువకుఁడు. ఉత్సాహపరుఁడు, అపూర్వ భావనాబల సంపన్నుఁడు రాయలసీమలోని పేరెన్నికఁగాంచు కవి శ్రేణిలో మున్ముందు చేరఁదగువాఁడు.

“తొలకరి చినుకులు” అను నీ కృతి యీతని తొలుతటి రచనము. దీని నామూలాగ్రముఁ క్షుణ్ణముగాఁ జూచితిని. ఈతని యద్భుత భావాంబర వీధిని గవితా కుమారి స్వచ్ఛందముగ విహంగమ విహార మొనర్చుచు రసిక జనానంద బంధురమగుట కడుంగడు ప్రశంస్యము.

“భావనా బలమున్నది ప్రకృతి యన్న
దిష్టముండిన పదముల కేమి కొదువ?”

అని యాధునిక కవిసూక్తి ఊహ, ఉపజ్ఞ, ఉత్సాహము, ఉద్వేగము గల కవికి కవితా వస్తువును ప్రకృతి స్వయముగఁ ప్రత్యక్ష మొనర్చును. దాని నాకళింపఁ గలవాఁడె యుత్తమ రచయిత కాఁగలడు. ఊరక పదములకు వెదుకులాడుచు, శబ్దకోశములు త్రిప్పుచు, నెట్లో యొక కొన్ని పద్యములల్లి గ్రంథమును బలవంతముగా గట్టెక్కింపఁ జూచు వారికి గవితా కన్యకుఁ బొత్తు కుదరదు. అట్టివారి కవితలు జీవకళ లేని చిత్తరువులు.

ఈ కవి కుమారుని భావనా బలమపారము. ప్రతి పద్యముననేదో యొక నూత్న భావము ప్రస్ఫుటమగు చుండును. ఈ కావ్య సంపుటిలోని ప్రతి ఖండికయు పఠితల హృదయ కుహరముల దాటిచను నుత్తమ సాంఘిక పరిస్థితుల నవ్యాను భూతిని ప్రసాదింపఁజేయు పాటవముఁ గలది. అన్నియు గంభీర భావసమంచితములు. సులభగ్రాహ్య విషయకములు.

ఇందుగల ఖండికలు తొమ్మిదియు నత్యంత రసవత్తరములు. అందును 'అప్పగింత', 'బడిపంతులు', 'సందేశము', 'గతము' ఈ నాలుగును మధుర తమములై చదువఁ జదువఁ జవులూరించు పాకమునబడినవి. మచ్చునకు నీ నాల్గింటి నుండి యొక్కొక్క పద్య ముదహరింతును.

"అతులిత ప్రేమ వార్ధిలోనోల లాడు నీకు
మల్లె మొగ్గలు దెచ్చితి మాటలేల
దోసి లొగ్గవె; మనసారఁ బోసి పోదు
నిరసనకుఁ జోటు చూపకు నీరజాక్షి!"

"జ్ఞాన వార్థిని గడవచుక్కాని గలుగు
నౌక నీవౌదు కాని యీ లోక మట్లు
నిన్ను గూర్చి తలంపదీ చిన్నతనము
పంచి కుడుచుఁ బ్రపంచము పంతులయ్య?"

"వలపు చిగురాకు సెజ్జలో నిలువు దోఁపు
దీయు వగలాఁడి చూపుఁలోఁ దేనె సోన
లురలు గ్రొంఁగైతలో మంచు తెరలలోఁబ
సందు పూఁదావిలో సరసతను గంటి!"

"బీద సాదల నెత్తురు పిండి పిండి
వంట లంజేసి తినిత్రేఁచు భాగ్యవంతు
లేఁడ? యాఁకలి డొక్కలు మాడి చచ్చు
ననద లేఁడ? మఱెట్టులీ శని నశించు?"

ఇట్టివి యింకను నుదహరించి, యీ పీఠికను పొడిగింప దొరఁకొనను.

ఈ ప్రథమ కృతికిఁ దగిన భర్తను సంపాదింపఁ గలిగిన యీ యువకవి మిగుల ధన్యుఁడు. కేవల మర్థాకాంక్షతో తమ కృతుల నరసికుల కంటగట్టు పరిపాటి గల నేటి కవి కోటిలో నిష్కాముఁడయి విద్యా వినయ వివేక సంపన్నుఁడును, సరసుఁడును, విద్వత్కవియు, భాషాజీవియు, బహుళ గ్రంథకర్తయు, వివేషించి నా కత్యంతముఁ బ్రియశిష్యుడునగు పతికి నర్పించుట యసామాన్య విషయము. ఈ సంబంధముచే నా యందేక లవ్య భక్తిఁగల యంతేవసత్సమితి యందీ కృతిపతియు గణింప దగిన వాడగుట ముదావహము.

ఇట్లే యీ తరుణభావ యువకవి సత్తముఁడు ఇతోధికముగ భాషా సేవ యొనర్చుచు పెక్కులు కబ్బములు వెలయించి యాంధ్ర శారద నలంకరింపఁదగు శక్తి సామర్థ్యములను గ్రహింప హృదయపూర్వకముగ బరమేశ్వరుఁ బ్రార్థింతును.

మదరాసు, విద్వత్కవిభూషణ,

**విజయ, జ్యేష్ఠము.** **విద్వాన్ వేదము వేంకట కృష్ణశర్మ**

# ఆశీస్సు

విచ్చు విరిమొగ్గలో వెల్లి విరియు వలపు
దెసల మసలెడు గాడ్పుల ముసుఁగుఁ దొలఁచి
చూచి తొనిచూడ్కి నవ్వ దోబూచు లార్చు
కైత కమ్ముడువోని మగండు గలఁడె?

**(సం) విద్వాన్. అ. చంద్రశేఖరశర్మ**
తెలుగు పండితుడు, బోర్డు ఉన్నత పాఠశాల
పోరుమామిళ్ళ

# అభిప్రాయము

ప్రాచీన సంప్రదాయ బద్ధులమని చెప్పికొనెడి వారికి ఒక విచిత్రమైన యంటుజాడ్యము గలదు. వారే కావ్యమును గాని వ్యుత్పత్తి దృష్టిలో జూతురు. భాష–భావాభి వ్యంజనమునకు – బలహీనమగు నొక సాధనము మాత్రమే. కాని ఆదియే సర్వమని వారి దురూహ. అది ప్రాచీన సంప్రదాయమని వాదించి వీరితోపాటు గతించిన యలంకారికులను గూడ యరసికులుగా జేయువరకు వీరి పట్టుదల – తన పట్టుదలను వదలదు. భాషా ప్రాబల్య మమితమై అంతశ్శక్తి లేని కవిత శీలము లేని ఆభరణ భూషితయగు స్త్రీ వంటిది.

భాషకి బలహీనత యున్నది. కనుకనే – ప్రశస్తుడగు కవి – తన భావములను దెలుపుటకై నానా వేదనలు పడి బాష నిష్టము వచ్చినట్లు సుళ్ళు వెట్టును. అప్పుడు "ఉక్కు పిడికిలి" వంటి పదములు బుట్టును. కేవలము శబ్దార్థములనే నమిలి భావించుటెరుగని పండితుడు "పిడికిలి యందుక్కు యెక్కడిదని" ప్రశ్నించును. ఒకసారి నా "అగ్నివీణ" పదమున కిట్లే యర్థమడిగిరి. నేను నవ్వి యూరకుంటి.

పద్యము లెందఱో వ్రాయరు. వ్రాసిన దానకంతయుఁ దాను "రెండవ నన్నయ" ననియే భావము. వాని పద్యరచనమే కవిత గాదు. నిజమైన కవి తన చూపులో ప్రకృతిని చూచును.

"వలపు జవ్వనికి ముద్దు చెల్లింప సాంధ్యరాగ
మవిరళంబుగ బంగారు రవికెయయ్యె"

అను భావము "కవితా సంస్కారము" లేని కవికి కలుగదు. ఈ పద్యమును చూచి యీ యువకుడు కవి యందును.

ఈ రచయిత వర్ణించిన విషయములు సాధారణముగ మన మందరము చూచుచున్నవే. "పాఠకుఁడ! శ్రమ జీవుల పాటుగనుము" అని యాతడన్న "శ్రమజీవులు" యెవ్వరో గాదు. మనమూ – మనవంటి వారూ. కలకాలము భాగ్యవంతుల కావడులు మోసిన కవి కలములకు నేటికి "స్వాతంత్ర్య ప్రవృత్తి" యబ్బుట దేశమునకొక భాగ్యము.

ఈ యువ కవులలో నెంతయో యుదారత, తెగువ, త్యాగము ఉన్నవి. కాని చాలామంది యొక్క విషయమును మాత్రము గమనించుట లేదు. ఈ వర్గ భేదములకు ధనికుల దురాగతములకు "అస్తికతాబుద్ధి" ప్రబల కారణమని వారి తలపు. కాని అదియట్లు గాదు. ధనికులతో "దుర్మార్గములు చేయుడని దైవము" చెప్పలేదు. వారిని "క్షమించి కృశింపుడని" దీనజనులకును ఆయన పలుకలేదు. నిజమునకు దేశ చరిత్రలో "దురాగతముల" నెదిరించిన వారందరు దైవముపై "నంతయో యంతయో" విశ్వాసము గలవారే. కర్మవాదము, ఆస్తిక్యబుద్ధి మొదలైనవి "నవీనుల" "సమాజ వాదము"న కడ్డురావని నాయూహ. "గతి తార్కిక విధానము" మనకు క్రొత్త విధానము గాదు.

ఎవ్వరికైనను ఒక్కొక్కసారి "తిండిలేనట్టి వారికి దేవుడేల?" అనెడు తిరుగుబాటు కలుగుట సహజమే కాని యీ భావములు వారికే స్థిరముగా నుండవు.

"తొలకరి చినుకుల" కవి నాస్తికుడు కాడు. "సంశయడోల" అను శీర్షికలో నాతడు ఆస్తిక్య బుద్ధిని దన మనస్సులో మొరపెట్టినాఁడు. ఒకటి మాత్రము నిజము. సమాజమెంత ముందునకుఁ బోయినను దాని కర్థముగాని దెప్పుడును గొంత యుండియె తీరును.

"సర్వేజనా స్సుఖినో భవంతు" అన్న ఋషులు స్వార్థపరులుగారు. వారు వేనుని సహింపలేదు. పరుశురాముడు 'కార్తవీర్యుని' దుర్మార్గమునకు బుద్ధిజెప్పక విడువలేదు.

ఈ కవికి తీవ్రమగు భావనాబలమున్నది. ఆ భావమును వెల్లడింప గల సునిశితమై వెనుకాడని వాక్కును గలదు. ముమ్ముందు – పేరు పెంపుల కథ యట్లుండనీ – సమాజమును పురాషార్థమునకై నడపించు మహా యోధులలో నీతడొకడగునని యాశింతును. గత చరిత్రలో ఫ్రాన్సు దేశమున "విప్లవము"ను కవులే దెచ్చిరి.

మహాకవి, సరస్వతీ పుత్ర,

**పుట్టపర్తి నారాయణాచార్యులు**

# ప్రశంస

నవ్య భావనా భరిత సంభావ్య మైన
సరస కవితా మృతంబును సాదరమున
జనుల కదించు భాగ్యంబు చాలగలిగె
ధన్యుఁడవు నీవు మిత్రమా! తథ్యముగను

తొలకరి చినుకులు రైతుల
కలిమికి మూలం బటంౘ్రు; కవులకు నీ యీ
'తొలకరి చినుకులు' కావ్యము
మెలఁకువఁ గల్గించు దానమేలు జగతికిన్.

నిగ్గు లీనుచు నవ నవోన్మేష మంది
క్రొత్త నెత్తావి చల్లు పూఁగుత్తివోలెఁ
దెలుఁగు పూఁదోఁట వలపులు కలయఁ బఱపి
సుకవితతి కాత్మ కళలెల్లఁ జూఱలిచ్చుఁ

**మైనంపాటి సుబ్రహ్మణ్యము**

విజయ, జ్యేష్ఠము

చిత్రకళోపాధ్యాయుడు,
స్థానికోన్నత పాఠశాల, కోడూరు.

# ఆవేదనము

ఉ॥ కాకులమూక కావురని – కారఱపుల్గొనె వేఁగు బోక నీ
మూఁకుడు జోలెలో నునిచి – ముంచు దరిద్రము మూఁపు నెక్క నీ
యాఁకటి చిచ్చు జీవముల – నార్ప నెకాయెకి తిండిఁ గోరి యే
చీఁకటి కోన కేగెదవొ? – చెప్పుము! మిత్రమ! తాపమయ్యెడిన్.

ఉ॥ గాలికిఁ దూఁగి యాడుచు నె – గాదిగఁ జూచుటకేని నోఁచుకో
కీలవలేశ జీవన మ – నింగిత శేముషి, దైన్య భావమున్
లాలన సేయ నెచ్చట మె – లంగెద వక్కట! నీవు; సాయమౌ
జోలె నయాచి తార్ధములు – జొప్పడు టెప్పుడు భిక్షుకాగ్రణీ!

చ॥ అఱచెద వేలనోయి తడి – యాఱిన గొంతుక మూఁగవోవ నూ
పిరి బిగబట్టి; నిన్నిచటఁ – బిల్చు మహాత్ములులేరు తిండికే
కొఱవడినట్టి నీ బ్రదుకు – కోసరమే యనుకొంటివేమొ, కా
దుర! ప్రకృతిం గనంబడెడు – దోపిడు లెల్లను స్వార్ధ కృత్యముల్.

ఉ॥ పారములేనిబాధ పరి – పాలనఁ జేయుచునుండె నీదు సాం
సారిక రాజ్యమందు; మన – సార సృజించె నెవండొ! చెప్పఁగా
లేరిది నిక్కమంచు; దరి – లేదని వాకొన నాకుఁగాదు; వే
సారకు నీ పరిస్థితికి – సారెకుఁ గ్రుంగె మనంబు చింతలన్

గీ॥ మండు టెండల నడివీధి – మొండితనము
నిన్ను గొఱమాలి దొరలింప – నీరసముగ
విధి విరామములేక యే – విధినిఁ గూర్చి
భిక్షకుఁడ యేడ్తు విక్కడ – దీక్షఁబూని.

గీ॥ జీవిత సముద్రమునఁ బడి - నావలేక
చిక్కి కిక్కురుమను నిన్నుఁ - జక్కఁజేయ
నొక్కరును రారు మున్ముందు - దిక్కులేని
కఠిన దుర్దశఁ దరియింపఁ - గదలి రమ్ము.

గీ॥ యాచనం బవినీతి; య - యాచనమ్ము
నయ పథంబని పెద్దల - న్నారు సుమ్ము
ఉక్కు పిడికిటితో నిన్ను - నొక్కిపట్టి
యట్లు చెప్పిరెకాని య - దెట్లు నీతి.

గీ॥ అడుగనేటికి సర్వముఁ - బుడిసిలించి
ప్రకృతి మనకేడుగడ యయి - ప్రబలుచున్న
దిది మహత్తర సమయమౌ - నిప్పుడింక
పిడికిలి బిగించి ముందుకు - నడువవయ్య.

ఉ॥ ప్రాఁకితి వెన్ని వర్షముల - పాటిటు భిక్షుక! సజ్జనత్వమన్
పాక మదేదొ మాయమయి - పాసె జగంబది కట్టు దిట్టముల్
లేక పరిభ్రమించెఁ దుది - లేక చరించె జనాళినీకుఁగాఁ
బాకముజేసి నా కవితఁ - బాడెద గుండె ద్రవించి పారఁగా.

చ॥ కళ వళ పాటు తోడఁ గల - గంటి స్వరాజ్య మొకండు గల్గు నం
చల కల కల్ల గాక నిజ - మయ్యెను గాని త్వదీయ జీవికన్
ఫలితము గూర్పఁ జాలదది, - భారతు లింక తదీయ కార్యముల్
సలుపఁగ నెంతురో? సలుపఁ - జాలక దిక్కులు చూచు చుందురో.

# సంశయడోల

గీ॥ సకల మానవ లక్షణ - సంయుతమ్ము
జీవితం బిట్లు వికృతము - సెందనేల?
సృష్టి సర్వోదయంబులో - దృష్టి నిలుపు
మీకు నన్నిట్లు సేయుట - మేలె స్వామి!

గీ॥ స్వార్థపర సంఘ నియమ ని - ర్బంధ కలన
కఠిన రాక్షసు లెవరొ సం-స్కరణ రూప
దుర్దశా కూపమున నన్ను - ద్రోసినారు
సదయ హృదయుఁడ వీవిట్లు - సలుప వెపుడు.

గీ॥ వెల్లి విరిసిన మల్లెలు - చల్లగాలి
నూఁగె దరహాస చంద్రిక - ల్మూఁగె దిశల
కల్లకపటం బెఱుంగని - పిల్లయెడఁద
తల్లడము మీరెఱుంగమి - తప్పుగాదె?

గీ॥ హద్దు మీరిన వలపు నా - యొద్దనుండి
పరుగు లెత్తెను విశ్వ వి - భ్రాంతి యొదవ
నంతలోఁ జిమ్మ చీఁకటి - పంతగించి
గెలిచి తలఁదన్నె నిస్పృహ - మొలకలెత్తె.

గీ॥ వన్నె చిన్నెలు దొన్నెల - వడియఁ బోసి
త్రావఁగా నిచ్చి కన్న సం - తాన మంచు
మురిసినది నాఁడు నేఁడామె - సరస లేదు
మలిన పరివర్తనంబు నే - మఱువలేను.

గీ॥ దైవమే సాక్షియన నీదె - తప్పు, గాక
సంఘమే సాక్షియనఁ దప్పు - సంఘమునకు
సంఘటిల్లును, దీనికి - సాక్షులెవరొ?
సంశయము చుట్టు ముట్టె నా - స్వాంతమందు.

గీ॥ ఆట పాటలఁ బూఁదోట - లందు మెలఁగి
వయసు వలపులతోఁ గూడి - వఱలునాడు
జీవితము బిట్టు రట్టయ్యె - జీవఫలము
క్రుళ్ళి మన్నయ్యె నింకేమి - త్రెళ్ళఁ గలదు?

గీ॥ భగ్న జీవినినై నేను - నగ్న సత్య
మరయఁ జాలక యడిగితి - నంతెకాని
యెడతెగక సంశయాంబుధి - నీఁదులాడఁ
గలుగుదునె? స్వామి! నా చేతఁ గాదుకాదు.

# అప్పగింత

గీ॥ వలపు సిరి తొొలఁకాడు నీ – వదనశోభ
నడవి పాల్చేసి యిట్లేల – యడల బాల!
నవ్వు పువ్వుల నాపైన – ఱువ్వి ప్రణయ
భిక్షమిడు మింక నాపయి – కక్ష యేల?

గీ॥ అతులిత ప్రేమ వార్ధినో – లాడునీకు
మల్లె మొగ్గలు దెచ్చితి – మాటలేల
దోసి లొొగ్గవె; మనసారఁ బోసి పోదుం
నిరసనకుఁ జోటు చూపకు – నీరజాక్షి

గీ॥ సంఘ దౌష్ట్యాల కెంతయు – జంకఁ బోకు
సహజ సౌందర్య లతవు నీ – సరస నుండ
నాదుమది పొంగువాఱె నీ – వాదులేల
ముద్దు చెల్లింపు మొకసారి – ముద్దరాల!

గీ॥ మిసిమి పసిఁడి పసందును – మించుమేని
తళుకు క్రొొందేనె సోనలు – ద్రావఁ గోరి
దోయిలించితిఁ గాసంత – దోస మనక
యాన బెట్టవె దయఁబూని – నాన మాని.

గీ॥ సంఘము బిగించి సంకెళ్ళు – సడలె నూత్న
పాండురప్రభ విలసిల్లె – భావి జీవి
తంబు నందెందుకో నీకు – దాపరికము
ముందు వచ్చితి రాగిణీ – పొందుఁగోరి.

గీ॥ భావలత చక్కగా పూసి - పరిమళించెఁ
దొడిమ కడరాలె ముదురాకు - మడుపులెల్ల
భావ వీధుల నుండి శు-భాంగి! నన్ను
తొంగి చూడవె తనువెల్ల - పొంగి పోవ.

గీ॥ భావనా దీపికల వెల్గు - వారె జగతి
మాట వరుసకు నీవె నా - మరుఁగుఁ జేరి
గీటు దాఁటకు మని కన్ను - గీఁట వేల?
రాసకేళికి నీవేల - యాస పడవు?

గీ॥ త్రోవలో నవ్వ పువ్వుల - దోఁచు కొంచుఁ
జల్లనగు పిల్ల గాడ్పుల - నుల్ల మలర
వలపు తలఁపులు బరువెత్తి - వచ్చుచుండె
సమ్మతిని దెల్పుమిదె యిత్తు - స్వాగతమ్ము.

గీ॥ మన మనంబుల జనియించి - మసలు వలపు
జవ్వనికి ముద్దు చెల్లింప - సాంధ్య రాగ
మవిరళంబుగ బంగరు - రవిక యయ్యె
పైఁట సవరింపు నునుసిగ్గు - మాటుఁ బెట్ట.

# పనికత్తె

ఉ॥ పొత్తిలి పాపవై జనని – పొత్తు నెఱుంగక చిత్త సంస్కృతిన్
బొత్తిగ లేక యీ ప్రకృతి – పూర్ణ సుధాంబుధి భావవీచి యం
దెత్తిన ముద్దు బిడ్డవయి – యేమని యూరటఁ జెందినావొ నీ
వత్తరి వంతు పాట పని – యంచు దినంబుల వెళ్ళఁ బుచ్చెదో.

చ॥ అల నడయాడు నాఁటికె మ – హత్తరమై సహజాను రాగముల్
మెలఁకువ పేర్మి పెద్దలకు – మెప్పు నుదారత దైన్య భావముల్
గలుగఁగ జేసి తౌర! పని – కత్తె వటన్నను నీవుగాక యిం
కిలఁగలరే తలంప నొక – యించుక మాయునె మానవస్తుతుల్.

ఉ॥ ముద్దులు మూటఁగట్టు పద – ముల్ బచరించెడి వేళనైన నీ
హద్దును దాఁటకే ప్రజల – యానతి దాఁటక బద్ధ జీవివై
తద్దయు బుద్ధి సూక్ష్మముల – దౌల్కొని యెంతయు వింత దోపఁగా
నొద్దిక లక్ష్య సిద్ధిఁగను – నో పనికత్తె! శుభంబు నీ కగున్.

మ॥ ఎలఁ బ్రాయమ్మున బయ్యె దన్నడు మునం – దే చుట్టి గోరంచు చెం
గులు మోఁకాళ్ళకు పైన దోఁపుకొని చన్ – గుబ్బల్జగా పైడి చెం
డుల దబ్బిబ్బొనరించి పాటుపడ నె – ప్డున్ లోక కల్యాణ మౌ
తలఁపున్ వాలకపున్ సిరుల్వఱలు సేఁ – తల్ సూడ మోదంబగున్.

కll పురిటిల్లు విడచి నీ వా
దర బాదర రైతుపనులఁ - దలనిడుకొని యం
దరకన్నిగతుల సేవా
పరమగు పనికత్తె వగుట - భవమన నీదే.

ఉll తీఱు దినంబులందు పని - తీరు లెఱింగి సమన్వయించి నీ
చేరువనుండు తోడి పని - చేడియలన్ బురికొల్పి రైతు లం
దూరటఁ గూర్చు నో యబల - యుజ్జ్వల వైభవ సచ్చరిత్ర! నీ
మారుగ సాక్షి చిహ్నములు - మామక జీవితమం దెసంగెడిన్.

చll శుభములు గల్గు నీ యెడఁద - జోస్యము వ్యర్థముగాదు సుమ్ము నీ
విభవము చేయి సాచినది - విశ్రుత కీర్తికి పట్టు జిక్కె నో
శుభచరితా స్వరాజ్య రథ - చోదకుఁడై భరతాత్మజుండు సు
ప్రభఁగనె నీ జుగుప్సలను - బాపఁగ దీక్షను బూనినాఁడిఁకన్.

శాll అయెం బోయెను జీవితావసర మ - న్యా క్రాంతమై సౌఖ్యమే
చాయంగల్గదు కష్ట నష్టములె యి - ష్టా పూర్తి వాటిల్లె స్వే
చ్ఛా యత్తంబగు యత్న మొండయిన లే - దావంత యానందమున్
డాయంబోని పరిశ్రమల్ గలిగె లేఁ - డా! దిక్కు నీ కొక్కఁడున్.

# బడిపంతులు

గీ॥ నీవు చల్లిన విత్తులే – నిలిచి మొలిచె
ప్రజల మొదటి పొలమ్ములం – బ్రాంకి ప్రాంకి
అవ్వియే జ్ఞాన మార్గము – లయ్యెం గాని
మట్టితోఁటాలతోఁ జేసి – నట్టి వగునె.

గీ॥ మట్టి గోడల కొట్టము – నట్టనడుమ
కఱకు కంకర నేలపై – కలము వట్టి
ప్రాంత బల్లలపై నీదు – బ్రదుకు కొఱకు
సేయుదే రక్తదానము – రేయి బవలు.

గీ॥ తెల్లవాఱంగఁ గన్నుల – ల్లల్లఁ దెఱచి
పల్లె పిల్లల యుల్లముల్ – జల్లు మనఁగ
నిల్లు వాకిలి విడచి పె – ల్లుల్ల సిల్ల
మెల్ల మెల్లఁగ బోధింతు – వెల్ల వేళ.

గీ॥ అధికృతులు వెట్టు కట్టడ – లరయరాదు
ఇట్టి రట్టడి జీవిత – మెందులేదు
బహు కుటుంబ భరంబది – వదలనీదు
కఱకు ఱాయైనఁదనదు దు – ర్గతికిఁ గరఁగు

గీ॥ ఆలు బిడ్డల కష్టమ్ము – లాత్మఁగొనక
పాలు వోవని నిస్పృహ – పాలఁ బడియుఁ
"బాలలోఁ బడ్డ బల్లిని" – బోలు నీదు
జీవితపు టోడ నెటు దరిఁ – జేర్తువయ్య?

గీ॥ జ్ఞాన వార్ధిని గడవ చు - క్కాని గలుగు
నౌక నీవౌదు కాని యీ - లోకమట్లు
నిన్నుఁ గూర్చి తలంప దీ - చిన్న తనము
పంచి కుడుచుఁ బ్రపంచము - పంతులయ్య

గీ॥ శ్రామికుల కంటె జీతము - చాలకొలఁది
జ్ఞాన మార్గ వినిర్మాత - వైన నీకు
బుద్ధి జీవికి గౌరవ - మున నొకింత
గొప్పయే కాని బ్రదుకులోఁ - గొఱంత నిజము.

గీ॥ తేలుఁ బవళుల పిల్లల - మేలుఁ గోరి
కాలు కదపక విద్యల - గఱపి సగము
పొట్టకుం జాలి చాలని - మొత్త మంత
గొనుందు వడియాస లుల్లము - గొల్లఁ గొట్ట

గీ॥ చాలి చాలని బత్తెంబు - జాలిఁ గొలువఁ
బ్రొయ్యిలోఁ బిల్లి లేవక - ముడిగి యుండ
వంట కుండలు దమలోన - వాదులాడ
నెన్ని దినములు సంసార - మన్న నీకు.

గీ॥ అంత మెఱుఁగని కష్టాల - బొంతయయ్యె
నీదు జీవిత మిది దాఁట - నేది మార్గ
మిట్టి తఱి నీకుఁ దోడ్పడ - నట్టి జన్మ
పాప పంకిలమో బడి - పంతులయ్య.

గీ॥ నీ ప్రయాసకుఁ దగినట్లు – నీ ప్రతిష్ఠ
దేశ విఖ్యాతమయ్యె నా – యీశుఁడైన
నాశ మందని యశమున – కాశపడును
గాన పంతుల కతఁడె శ్రీల్ – గలుగఁ జేయు.



వైసివి ని సన్మానిస్తూ యన్.సి. రామసుబ్బారెడ్డి, ఇలియాస్ రెడ్డి
జానుమద్ది హనుమచ్ఛాస్త్రి

# గతము

గీ॥ పలుకఁ జాలని తలఁపుఁ ది - ప్పలకు నెక్కి
గగన తారలతోఁ జేయిఁ - గలిపి విశ్వ
విభవ శోభిత లక్ష్మికి - నభయ మిచ్చి
కలలు కళగాఁగ శాసించి - నిలిచి తపుడు.

గీ॥ మధుర భావాల నెడఁదలో - మఱుఁగు పఱచి
విశ్వ సంక్రాంత మొనరించి - విసుఁగులేని
సృష్టి కర్తకు దోహద - దృష్టిచూపి
క్రొత్త కైవల్య పదమును - హత్తుకొంటి.

గీ॥ తలఁపు లభిసారికలు చూపు - వలపు పైన
నిలిపి, చిలిపి తనంబెల్ల - నొలిచి పెట్టి
యవిరళావ్యక్త మధుర స - త్య స్వరూప
మెఱిఁగి సువిశాల పరిణతి - నెంచుచుంటి.

గీ॥ విమల కమలాకర పరీ మ - ళముల చల్ల
గాలి యూయెలలోఁ దూఁగి - సోలిపోయి
నూత్న శృంగార చంద్రికా - నూపురముల
గల్గలా రావముల తాళ - గతిని నెంతు.

గీ॥ పండు వెన్నెల సర్వ ప్ర - పంచ మందు
రాజ్యమేలఁగఁ జేతన - ప్రజ్ఞ వడసి

మానవాభ్యుదయంబును - మలచి నిలిచి
పంచి పెట్టితి ప్రణయ వి - పంచి మీటి.

గీ॥ దట్టమగు నీలి మబ్బుల - దాఁగి మరల
తొంగి చూచుచు నుసిగొల్పు - దొంగతోడఁ
గయ్య మొనరించుటకుఁ గాలు - కదపి నేను
నిత్య మానంద వీధిలో - నెమకు చుంటి.

గీ॥ రాగ వాహిని చిన్ని త - రంగ మగుచు
మోహమతిఁ గల్గియున్ మోక్ష - ముసు భజించి
యిసుక తిన్నెల గాలినే - మెసవి ఘోర
తపము సేసితి భోగ సం - తతి దలంచి.

గీ॥ కోకిలా లాపముల వినఁ - గోరి కొమ్మ
కొమ్మకుంబోయి చిగురు టా - కుల వినూత్న
శయ్యపై మేను జేరిచి - శ్రావ్యనాద
మాలకించుచుఁ గ్రొత్త స్వ - ప్నాలఁ గంటి.

గీ॥ హాయిగాఁ గొండ గుహల శ - య్యల రచించి
మధుర భారత గీతికి - మరుగు నాకు
లోకమేమయి పోయిన - లోటు గలుగ
దన్న నిర్వృతి నానంద - మందు చుంటి.

గీ॥ భరత వీరుల గాథ ల - బ్బురము మీరఁ
జదివి నిలువెల్ల ముదమున - జలదరింప
వీర విక్రమమును మన - సారఁ దడవి
గర్వమునఁ బొంగి పొరలి ని - క్కమ్ముఁ గంటి.

గీ॥ పండు వెన్నెల దోసిల్ల - బట్టి త్రావి
యమృత రసవీచికలను స - య్యాటలాటి
గొనబు ననకారు పుప్పొడి - కుప్పలెక్కి
యసమ రసమయ జీవిత - మందఁ గంటి

గీ॥ చిగురుటాకుల నును పట్టు - సెజ్జఁ గూర్చి
స్వాదు ఫలముల నారగిం - పఁగ నమర్చి
శాకపత్ర పుటిం దేనె - సంతరించి
పరవశత నుంటి లోకమే - మఱచి యుంటి.

గీ॥ మధుర సంగీత విభవ సా - మ్రాజ్య సౌధ
తలము నరయఁగఁ గోన కో - నలఁ జరించి
తెలిసికొంటి నిజోన్నత - సలిలపాత
మడవి బిడ్డలకై పాడు - సమరగాన
మే యటంచును దరిఁ జేరి - హాయిఁగంటి.

గీ॥ సర్వ సాహిత్యమిదు రస - పర్వములను
మలయ మారుత వీచికల్ - దెలియఁ జెప్పి

గుప్త సురభిళ గంధమ్ము – గ్రుమ్మరింపఁ
గమ్మఁగాఁ గ్రోలు చుంటిని – కడుపు నిండ.

గీ॥ అలరుఁ గన్నెలు నిండు వె – న్నెలల మునిగిఁ
పుప్పొడుల తొడవులు దాల్చు – ముగుద లగుచు
కిసలయంబుల దాఁపున – మసలి మధుర
రాగరస మొలికంప నేఁ – ద్రాగుచుంటి.

గీ॥ శైల శిఖరాల వంటి భా – వాల నెల్ల
సేకరించి రసంబుల – పాక మెఱిఁగి
పరుగు లెత్తెడి సెలయేటి – నుఱుగులందు
తేలి వెన్నెల వలపులో – సోలి యుంటి.

గీ॥ నిర్మ లాకాశమున మేలి – నీలి రంగు
తెఱల నడుమ విశాల సా – గరము మీఁద
నవ్య ఫణితిని తారకా – నాట్యరాజ్ఞి
గజ్జెలు గదల్చి యాడుటల్ – గాంచు చుంటి.

గీ॥ అరుణ కిరణుఁడు ప్రాభాత – మందుఁ బ్రకృతి
లలన కొంక చీర గట్టించి – చెలిమి నెరపి
కొసరి ముద్దులఁ గుఱిపించి – కోరి కోరి
బుజ్జగించుటఁ గను గొంటి – పూర్ణ తృప్తి.

గీ॥ అన్య దృక్కులు బ్రసరించ - నట్టి చోట
వికసి తానందమును బంచి - విమల గతిని
మించి నవతారకల నెంచి - మిసిమి కుసుమ
గుచ్ఛము వరించి పడసితిఁ - గ్రొంబసిండి.

గీ॥ వలయు మాటలు తన తల్లి - కలయఁ బలికి
ముంగురులు దువ్వి ప్రేమతో - ముద్దుఁ బెట్టి
తూర్ణ గతిఁబంప గంగా వ - ధూటి మలయ
మారుతుని తోడఁ గడలికిఁ - జేరఁ గంటి.

గీ॥ మధుర సౌరభ వనరాజ్ఞి - మంద పవన
మృదు తరంగములన్నిల్చి - ముదము గుఱియు
చిఱు నగవుతోడి మురిపెముల్ - నెఱపి మోవి
తేనెలందింప స్వప్న రా - జ్యాన నుంటి.

గీ॥ నిద్దపున్మబ్బు క్రొందళ్కు - నీలి చీర
చాటు నన్నగ్న సౌందర్య - మాటలాడ
నిబిడ రాత్రుల సౌదామి - నీ పురంధ్రి
కవుల కుపదేశ మిచ్చుటఁ - గాంచు చుంటి.

గీ॥ రాసలీలకు విధుఁడు పే - రాస నొంది
మలయ పవమాను బిలిపించి - వలపు బలిమి

కలువ రాణికి తనరాక – తెలుపు మంచు
సాగ నంపుటఁ గను చుంటి – సరస నుంటి.

గీ॥ మామతోఁ బొందు గోరి స – మాన సుఖము
కొఱకు నైజ విశిష్టతఁ – గోరి కోరి
తారకలు కల్వ జవరాండ్రు – తార సిల్లి
కొసరు కేకిసలను గనుఁ – గొనుచు నుంటి.

గీ॥ పూర్ణ చంద్రుడు సుఖముగఁ – బుష్పశయ్య
పైని శయనించి కలువ జ – వ్వనుల యధర
మధుర రసమును చవిఁ చూచి – మత్తుఁ డగుచు
పరవశత నుండఁ గను గొంటి – స్వప్నవీధి

గీ॥ ముద్దు లొల్కెడి కోయిల – సద్దు వినుచు
చిలుక పలుకుల మెచ్చుచుఁ – గలువ మగని
చల్లఁ దనమును బొగడుచుఁ – బిల్ల గాలి
నిసుక తిన్నెలఁ బలుమారు – మసలు చుంటి.

గీ॥ త్యాగమయ జీవితంబుల – యాగ ఫలము
పంచి కుడువఁగ నెంచి యా – చించు విధుని
కమిత వాత్సల్యమున నిచ్చి – విమల మతిని
మించు దిక్కాంత సొబగు భా – వించు చుంటి.

గీ॥ సంజ కెంజాయ బంగరు – సరులఁ దెచ్చి
పశ్చిమాశా సతీ కంఠ – భాగమందు
వలపు లిగురెత్త గీలించు – జలజహితుని
గడుసు పోకడఁ గను తమ్మిఁ – గనులఁ గంటి.

గీ॥ వలపు చిగురాకు సెజ్జలో – నిలువు దోఁపు
దీయు వగలాఁడి చూపులోఁ – దేనె సోన
లురలు గ్రొంగైతలో మంచు – తెరలలోఁ బ
సందు పూఁదావిలో సర – సతను గంటి.

గీ॥ పిల్ల గాడ్పులలోఁ దను – వెల్లఁ బులక
రించు బిగి కౌఁగి లింతలో – మించుఁ దీవ
గుంపులో మబ్బు తట పటా – యింపులో వి
నీల గగన తలమ్ములో – నిన్నుఁ గంటి.

గీ॥ మరుని క్రొవ్వేడి చూపులో – మందపవన
వీచిలో, చంద్రకాంతిలో, – వేణుగాన
లహరిలో, నాట్యకళలో, వి – లాస లాల
సుని ముఖాబ్జములో నీదు – సొబగుఁ గంటి.

గీ॥ నవ విలాసాప్తి నెసఁగు క – న్యా లలామ
బాహు వల్లరులం జిక్కి – ప్రణయ సౌఖ్య

మవనిఁ జిలికించి జగతికి – శివముఁ గూర్చి
కనిన పరి తృప్తికిం గీడు – గలుగఁ గంటి.

గీ॥ ప్రగతి జగతికి లేదంచు – వగచి నిత్య
మవ్య యంబైన భావ చ – ర్యలకుఁ జిక్కి
క్షమను వోనాడు నీ వియో – గమున స్రుక్కి
దిక్కు తెలియక పొరలుచు – సొక్కి యుంటి.

గీ॥ ఆత్మ శాంతికి యత్న మ – నంత గతుల
సాగుచున్నది గాని వే – సార వలసె
చిత్త సంక్షోభమవని రే కెత్తి నపుడు
శాంతి భద్రతల కట వి – శ్రాంతి లేదు.

గీ॥ నింగి నంటెడు శిఖరాల – నీలి మబ్బు
పడఁతుకల్ ముద్దులిడఁ బర – వశత నందు
గిరులు శాంతి సమత్వము – గురుతఁ జాటఁ
గనుచు నెలవంక వంక నేఁ – గదల కుంటి.

గీ॥ భావ వల్లరి పుష్పించి – పరిమళింప
బఱచు నెలదేఁటి మిన్నల – పాట లెల్ల
విను మనుచు నన్నుఁ బ్రేరేఁచి – విపుల శాంతి
నొసఁగ నాకుఁ బ్రసన్నత – నొందఁ గంటి.

గీ॥ విచ్చు విరిమొగ్గ సొగయించు – వింత వలపు
మబ్బు తునకలపై వీచు – మారుతమ్ము
సంజ కెంజాయలో రాగ – రంజితమ్ము
నాకు శాంతినిఁ గూర్పఁ బ్ర – ణామ మంటి.

గీ॥ అరవిరి గులాబి క్రొత్త లేఁ – దెరల నడుమ
గాడ్పు కుట్టి హుటా హుటి – కదలఁ బాటి
కోకిలమ్ములతో విందుఁ – గొనె నయారె!
యదియ నాకుఁ ప్రశాంతి యం – చలరు చుంటి.

గీ॥ రవి మయూఖమ్ములో మయూ – రమ్ము వింత
నాట్య భంగిమలో గగ – న ప్రతీన
తారకా పంక్తిలోఁ బ్రపు – ల్లార వింద
దళములో నుండి యుప్పొంగి – యలరు చుంటి

గీ॥ మేటి సెలయేటి నీటిలో – మినుకు మినుకు
మనెడు మిడుఁగురు బురువులో – హరిణ శాబ
కమ్ము చెరలాటలో, నగ్ని – కణములో, హ
రీత వనపంక్తిలో సంచ – రించు చుంటి.

గీ॥ ప్రణయ కలహమ్ములో, సతీ – పతుల ముద్దు
ముచ్చటలలో, నిసుంగ వా – పోతలో, న
నాథ దీనారవమ్ములో – జ్ఞాని యోగ
దృష్టిలోఁ బర్వులెత్తి చ – రించు చుంటి.

# కడుపు మంట

గీ॥ నాకు లోకము దెలిసిన - నాఁటి నుండి
తల్లిదండ్రులఁ బాసి నీ - యిల్లుఁ జేరి
పసుల కాపరినై యొంటి - మసలు చుంటి
పెంట కుప్పలతోఁ బాటు - పెరుగు చుంటి.

గీ॥ కుండగోకుడు కూటినిఁ - గుడిచి ప్రీతి
మండు టెండల పొలములో - నుండి చేలఁ
బంటఁ గాపాడుచుంటి నీ - యింటి వాని
వలెను నాయాస లేమైనఁ - దలఁప వయ్యొ.

గీ॥ మంచెపై నిల్చి పిట్టల - చంచు లదర
నొడిసెలను ద్రిప్పి రాల్వేసి - పడు శ్రమమ్ము
తలఁప వేమయ్య! సంపద - తలఁప నీదొ?
వడియఁ గట్టిన కష్టము - చెడుగటయ్య.

గీ॥ కాడి గట్టుటకే చేత - గాని యట్టి
చిన్న తనమునఁ బొలమంత - దున్ను చుంటి
ప్రొద్దెరుంగక చేసితి - సద్ది తోడ
నాఁటికిని నేఁటికిని వంతు - పాట వోలె.

గీ॥ ఊరి కాండ్లన్ని గవనిలో - జేరు చుండ
రచ్చబండలపై నుండు - రైతు లంత

నన్ను "మొనగాఁడు మొనగాఁ"డ - టన్నమాట
చాలు వేయేల? యామాట - చాలదయ్య?

గీ॥ మొదట మాయన్న పెండ్లికి - మొత్తుకొన్న
నూరు రూపాయలిచ్చి తా - నూటి కొఱకు
విడువ కారేండ్లు పనిఁ గొంటి - గడువు మీఱె
నైన విడువవు నను ప్రాంత - బానిస వలె.

గీ॥ అసలు దీరదు వడ్డి యెం - తయిన దనుచు
లెక్కఁ జూచినఁ బనిఁగొంట - తక్కువనుచు
లేని పోనివి చెప్పి బా - కీనిఁ బెంచి
కొంప ముంచితి విదిగూడ - గొప్ప తనమె?

గీ॥ ఇంత యన్యాయ మేటికిఁ - బంతమూని
బీద సాదల రక్తము - పీల్చుచున్న
తీర దేమయ్య! మీ యాశ - తీఱు దినము
లెన్న డొదవును? మా మంట - లెన్నడడఁగు.

గీ॥ పెండ్లి వయసాయె, నాకప్పు - విడువ దాయె
తీఱదా బాకి నా జీవ - మాఱు దాఁక
కష్ట మెప్పుడు నన్వీడ - నిష్ట పడదు
జాలి గుండియ గల్గ ద - దేల స్వామి!

గీ॥ గాలి వానలకు జెడి – చాలి చాల
నట్టి కొట్టము పడిపోయి – మట్టి గలిసె
నిలువ నీడైన లేని యీ – నీచ జీవి
తమ్ము వమ్మిది నగ్న స – త్యమ్ము సుమ్ము

గీ॥ ఎదుగుఁ బొదుగులు లేని మా – బ్రదుకు కడకు
గజ్జి కుక్క బలెం గష్ట – గాథ యయ్యె
నింతకును దీని బాధ్యత – యంత నీదె
మా బ్రదుకు దీసి మీరేమి – మనఁగలారొ.

గీ॥ అక్కళించినడొక్కల – వెక్కిరింత
చెక్కుచెదరని మాదీక్ష – మిక్కుటమయి
గాలిమంటల వోలె మీ – గాలిమేడ
లన్ని గాల్పకవిడుచున – టయ్యముందు.

# కృతఘ్నుఁడు

గీ॥ ఈ మహాకాళరాత్రిలో - నీ ప్రచండ
గహ్వరములోఁ గుటుంబిని - విహ్వ లార్తి
నొత్తిగిలి వత్తియై హృది - నత్తు కొనఁగ
నెక్కడికి నీ ప్రయాణ మొ - క్కింత చెపుమ!

గీ॥ అన్న! నీ దైన్య హైన్య శూ - న్య ప్రపంచ
వాసనలఁ గూర్చి ప్రశ్నింతు, - భావి నీకు
పూజ్యమొ! యపూజ్యమొ? పరి - త్యాజ్యమగునొ
యెఱుఁగఁ జెప్పుమ నీ కథ - లెల్లఁదడవి.

గీ॥ ఓ మహాభాగ! మీ ప్రశ్న - ప్రేమ జనిత
మగుచు నన్నుద్ధరించె నా - దగు చరిత్ర
కష్ట భూయిష్ఠ మిఁక దాని - కర్మ మర్మ
మేదియో, బోధ పడలే దొ - కింత మదికి.

గీ॥ పాడి పంటలఁ దులఁ దూఁగు - పల్లె ప్రక్క
పాడు వడినట్టి మాదిగ - గూడె మందు
పూరి కొట్టాల దారిద్ర్య - మునఁ దపింతు
నేమి చెప్పుదు జీవిత - మిట్టులయ్యె.

గీ॥ పల్లె మరియాద చొప్పున - నిల్లు వరుస
నూడి గంబులఁ జేయుచు - 'కాడి మేడి'

నమ్మి యంబలిఁ ద్రావి ని - త్యమ్ము రైతు
భూమి దున్నుచు నుంటిమి - పూజనీయ.

గీ॥ కోడి కూసెనొ లేదొ? నా - గూడెము విడి
యందచందాల బరణి ని - ల్లాలి వీడి
కాడి కోడెలె నాకేడు - గడ యటంచు
జీవికకుఁ జేయుచుంటి నే - సేద్య మిట్లు.

గీ॥ ఇంటి మాదిగవాఁడ, మా - యింటి కాఁపు
సలుపు పనిపాటులెల్ల వై - దొలఁగఁ జేసి
మూఁపు పయిమోసి పేరాస - యేపు సూప
నెదురు సూచితి నా 'మేర' - యొదవు నంచు.

గీ॥ 'గాలి కాలము నుండి యు - గాది' వఱకుఁ
బనులఁ జేయుచుఁ 'గల్లాల - పాళ్ల కెదురు
సూచు మాయాశ దీరఁగఁ - జూచు రైతు
నాశ్రయించితి ననుకొంటి - నయ్య మొదట.

గీ॥ "రాశి గింజలెగాని మి - రాశి లేదు"
నేను నా భార్య పనులెన్ని - యేని చేసి
గోడు గుడిచితి మటఁగూడు - గుడ్డ లేక
కడకు శ్రమజిక్కె, జీవిత - కాంక్ష దక్కె.

సీ॥ పదునైన పలుగుతోఁ – బాపటం బొనరించి
కొయ్య కాడల నెల్ల – కొల్ల నూడ్చి
ఇరుసాలు గొట్టుతోఁ – జొరఁదోలి పైపెచ్చు
బారగుంటక తోడఁ – బాయఁ జేసి
దిబ్బలో నెరువును – దిరుగ బైలునఁ దోలి
వండు మట్టిని బెక్కు – బండ్లు తోలి
యొకటికి మూఁడింత –లొప్పుగా మదిరెలో
నెరువుపై మన్ను నెం – తేని కలిపి

గీ॥ తొలకరించెడు ముంగారు – పలుకు చినుకు
లందు తొలిరి యెరుపు ప – సందు చిందు
లాడ భూమిని సామెన – యట్లు చేసి
కల కొలంది పొలమ్ము ప – క్వమ్ముఁ జేసి.

ఉ॥ ఈసతి గూడ నాఁడు మొదలిప్పటి దాఁకను రైతు నింట పే
రాస దిన ప్రవృద్ధి మెయినన్ని పనుల్ పనికత్తె వోలె సం
తోసము మీర రెడ్డి సతితోఁ బనిపాటులఁ దీర్చు చుండె నా
యాస మొకింత లేక మరియాదగు "నామని దండె కట్టుకై"

సీ॥ బీడు పొలాలపై – వాడు గడ్డికి మారు
పచ్చి పచ్చని పైరు – వచ్చుటకును
బ్రకృతి మాతకు వింత – ప్రసవంబు గల్పింప
నుబలాటపడి మేఘ – ముఖిమె దెసల

నిర్మ లాకాశాన – నీలి మబ్బులు నిండి
ౘ్రేలాడె కొండల – మాల లట్లు
బ్రహ్మాండ భాండంబు – బ్రద్దలించు విధాన
నుఱుముల శబ్దమ్ము – లుప్పతిల్లెఁ

గీ॥ జగతి జేనెఁడు తావైన – జార విడక
తడిపి తనిపెను సస్య సం – తతులు జెలఁగ
బడుగులకుఁ గొంగు బంగరు – వాన యనెడు
పలుకు ఋజువయ్యె వర్ష సం – పత్ప్రవృద్ధి

సీ॥ వర్ష మాఁగిన తోడఁ – గర్ష కాగ్రణులెల్ల
పొలమంత విత్త న – మ్ములను జల్లి
పై పాపటంబుల – బాగుగా సాగించి
దాని జాగ్రతగ నెం – తేనిఁ జూచి
రాపల్లె రెడ్లంద – అచ్చటి చిన్న తి
ప్పుల గడ్డిఁ బెరుగఁగా – వలిని బెట్టఁ
దలవరి రేఁబవల్ – నిలబడి గడ్డి గా
దము పెరుగఁగా నేఁటి – దాఁకఁ గాచెఁ

గీ॥ గోడె దూడల జంటను – పాఁడి యావుఁ
దక్కునుంగల పసుల మేఁ – తకయి నేను
భార్యతోఁ గూడి గడ్డికై – పరువులెత్తి
మసక సంజ చీఁకటి – మగిడి వత్తు

గీ॥ ప్రతి దినంబున కొక వన్నె – ప్రబలుచుండు
పంట చెలిమేని సొగసుల – బాగు పొగడ
నాది శేషున కేనియు – నలవి గాదు
మాకు సంతస ముదయించె – మఱల మఱల.

గీ॥ అదనులో వాన బడి పద – నయ్యెఁ బొలము
పంటబలమున్న దంచు మా – పల్లె రైతు
లమిత సంతోషమును జెంది – రయ్య యపుడు
పేద గూడెము నందిండ్లు – మోద మందె.

గీ॥ చెడ్డకాలము మాకొంపఁ – జేరి కొలిచె
ననుట కిసుమంత వెఱువను – మనసు రాదు
తెలుప మీబోటి వారికి మలిన గాథ
పట్టు దప్పిన పక్షిని – ప్రభుఁడ నేను

గీ॥ ఏల యాలరి బమ్మ యీ – యేలు బడిని
సృష్టి చేసెనొ? నాబోటి – కష్టజీవి
తోడి వారలలో నడ – యాడు భాగ్య
మవని లేదింక జగతికి – శివము లేదు.

గీ॥ నాఁటి దుర్ణయ కార్యంబు – నాతి హృదయ
పీఠ మగలించి వైచె నా – పీఁక నొక్కె
చెప్పలే నించుకేని యా – చెనఁటి రైతు
నాయెడఁ గృతఘ్నుతం జూపి – నాఁడు సామి.

గీ॥ బెట్టిదము దుర్గమము నగు - నట్టడవిని
నెదురుపడి జాలితో నన్ను - బ్రోదివి నాదు
పనికి మాలిన గాథకై - ప్రాఁకులాడి
తయ్య నాశ్రమ బాప పె - ల్లారటమున.

గీ॥ చంక చిక్కముఁ దవిలించి - చాల దూర
మరిగి యొకనాఁడు చెమటలఁ - గరఁగి గడ్డి
మిగులగాఁ గోసి మిడియెండ - దగులు సరికె
కొంప చేరితి శ్రమమెంతొ - దుంపఁ ద్రెంప.

గీ॥ సంకటము లెల్లవారికి - సంభవించు
నైజమిది సుమ్ము నీకును - నాకె గాదు
గాన శాంతిలుమని నీతి - గఱపు నట్టు
లిల్లు వాకిలి సందేశ - మిచ్చె నాకు.

గీ॥ హృదయ పీఠముపై పెద్ద - గుదియ తోడ
మోది నట్లుండె "నాసతి - నూఁది పట్టె
పాపిరె" డ్డంచు పరిసర - ప్రజలు వలుక
పాప పంకిల మగ్న జీ - వనమె రోఁత.

గీ॥ గడ్డి చిక్కము పశుశాల - కడకుఁ జేర్చి
మిగుల నాఁకటి చిచ్చు న - న్నొగులఁ జేయ
భగ్న సౌశీల్య నా ముద్దు పడఁతి లేమి
నరయఁగా నెంచి వేవేగఁ - బఱుఁగు లెత్తి.

గీ॥ ఇల్లు జేరితి ముంగిట - నేడ్చుచున్న
నా కుటుంబిని దుఃఖము - న్గానలేక
క్రాఁగి బిట్టేడ్చి వాపోయి - కలఁగి నాఁడ
కాని మాపాటుఁ గనఁగ నొ - క్కఁడును లేఁడు.

గీ॥ కోఁత కెదిగెను నాఁటికే - క్రొత్త పంట
వస్తుపడి యుండి యెట్టులో - పయన మైతిఁ
గాని కాలాడ దాకాఁపు - వాని పనికి
నొడలు ముందేగు మదివెను - కడుగు వేయు.

గీ॥ మఱియు వంచితశీల నా - మగువ గూడ
రెడ్డి మొగ మెట్లు జూచువాఁ - డెడ్డి యగుట
గాని పోకున్న జీవిక - గడచు టరిది
యకట! సృజియించు టెందుకీ - యనద బ్రదుకు.

గీ॥ రెడ్డిసానియు నతనిపై - దొడ్డ కోప
మూని వాదించెఁ గరుణా ని - ధాన యగుట
నైన నేమాయెఁ గఠినాత్ముఁ - డగుట వాఁడు
నన్ను పని నుండి పొమ్మని - నాఁడు కడకు.

గీ॥ అంతలో నూరకుండ కా - ప్రాంత ముననె
యుండరాదని గూడెము - నుండి వెడల

నడిచె దౌర్భాగ్య జీవిని – నౌట నేఁటి
కేమి సేయుదుఁ దలవ్రాఁత – యిట్టు లయ్యె.

గీ॥ కఠిన దారిద్ర్య మొకదిసెఁ – గఱచి చంప
దైన్య మొకవంక సతికిఁ జి – త్తము గలంపఁ
దెంపుమై రెండు చేరి నా – దుంపఁ ద్రెంప
వీడ కెటులుందునయ్య యా – పాడు కొంప.

గీ॥ సాక్షి చిహ్నాలు మాయ వే – సాకు లేదు
పొమ్ము నీ పొట్టకూటికే – భూమి కైన
ననుచుఁ బిట్టార్చె నచ్చోటి – యండజములు
పాఠకుఁడ! శ్రమజీవుల పాటు గనుము.

గీ॥ పలుకుఁ బడిఁగల వారలు – పాడు పనులఁ
జేసినం దప్పులే దెట్టి – శిక్ష లేదు
జగము గుర్తించుఁ నట్టి యీ – శాసనములు
సాధువుల శీర్షములు ద్రుంచు – సాధనములు.

# సందేశము

గీ॥ ప్రకృతి నవ్యక్త మధురమౌ – ప్రగతి నెంచి
నియతియై వ్యక్తి జీవిత – నియతిఁ గోరి
విషమ నిర్ణయమును జేయు – విసుగుఁ గనక
యట్టి యుత్కృష్ట సిద్ధి మీ – రరయ వలయు.

గీ॥ నిత్య మవిరామ కృషిజేసి – సత్య యుతము
భవ్య ఫలమును వాంఛించు – ప్రాణికోటి
కవ్యయత్వము సిద్ధించు – ననెడు బుధుల
విమల సూక్తిని బాటింప – వేడువాడ.

గీ॥ ఎంతయో స్వార్థపరత జీ – వింతురేని
స్వార్థ పరులని గర్హించు – జగ మదెల్ల
స్వార్థ రహిత కృషింజేసి – యర్థ మెఱిఁగి
బాధిత ప్రజకయి మీరు – బ్రదుకవలయు.

గీ॥ నవ్య సాహిత్య గగనాన – నాట్యమాడు
నిలుచు శంపాలతల్వలె – వలపుఁ జిలికి
ముగ్ధ మోహన జీవ నాం – బుధిని మునుఁగు
కవులయిన మీకుఁ గేల్మోడ్చి – కలసి కొందు.

గీ॥ వలపు సయ్యాట లాడెడి – వయసు మీది
వలపు సయ్యాట లాడించు – వనిత ప్రకృతి

కార్య దీక్షను వరియించు - గరిమ మీది
కార్య దీక్షను సృష్టించు - గరిత ప్రకృతి.

గీ॥ కొసరి భౌతిక వాంఛలఁ - గోరి కోరి
చేయవలసిన యుత్కృష్ట - చేష్టలందు
నలస భావంబుఁ బ్రకటించు - నట్టి జీవి
కమిత దుఃఖంబు ప్రాప్తించు - నంద్రు బుధులు

గీ॥ దీక్షతో కార్యసిద్ధికిఁ - దీవ్ర కృషిని
గొప్పగాఁ జేసి జయమందు - కోవిదుండు
సిద్ధ సౌఖ్యంబుఁ గీర్తినిఁ జెట్టపట్టి
ప్రజల కుపయోగపడు నంద్రు - ప్రాజ్ఞు లెపుడు.

గీ॥ వేద వాదంబు సల్పుచు - నాది మునులు
దైవనిర్ణయ ముందెల్పి - తనరి రపుడు
దైవ నిర్ణయ మేదియో - తడవ లేక
యీఁదు చున్నారు దుఃఖాబ్ధిఁ - బేదసాద.

గీ॥ రాత్రి దినములు బనిచేయు - రైతు వెంటఁ
గొండ కోనలఁ దిరుగాడు - కూలి వెంటఁ
గడుపు మంటకుఁ గష్టించు - బడుగు వెంట
దేవుఁ డొక్కఁడు వెన్నంటి - తిరుగు నంట.

గీ॥ ఎండ వానలకోర్చి శ్ర - మించు వాఁడు
తేనెపెఱలను ధైర్యానc - దీయువాఁడు
ముత్తెములకయి జలధిలో - మునుఁగు వాఁడు
దేవుఁడొక్కఁడు గలఁడని - తిరుగు వాఁడు.

గీ॥ ఉక్కు రక్కసి చేతిలోc - జిక్కువాఁడు
దారి తెలియని యడవిలోc - దూరువాఁడు
నింటి మంటలనార్ప య - త్నించు వాఁడు
దైవమున్నాc డటంచెదc - దలఁచు వాఁడు.

గీ॥ అనదయై దాయలకు లొంగి - యడలు వాఁడు
రాళులఁc బగిల్చి దారి నే - ర్పఱచు వాఁడు
క్రూర ఋణదాతలకు దాఁగి - కుములు వాఁడు
దైవ భీతికిc దలయొగ్గి - తనరు వాఁడు.

గీ॥ ఆవు రావురమను మంట - లావరించి
కడుపు గాల్పంగ దేవుఁడొ - క్కఁడు గలఁడ
టంచుఁ బల్కిన లాభమే - కొంచెమైన
కడుపు నింపని వాఁడు దే - వుఁడె తలంప?

గీ॥ పాక్షిక మతంబు వానికిc - బదవియేల
తన్నుc బ్రోవని దానికి - ధనమదేల
విషయములు లేనివానికి - విశ్వమేల
తిండి లేనట్టి వానికి - దేవుఁడేల?

గీ॥ అడవి నుక్కిరి బిక్కిరి – యైన వాని
భయము బోఁగొట్టి కాపాడ – వలెను గాని
దేవుఁడు గలం డటంచు బో – ధించి నంత
ఫలితమే? యట్టి వానిఁగా – పాడ వలదె?

గీ॥ బీదసాదల కాఁకటి – బాధ హెచ్చు
ద్రవ్యపరుల కజీర్ణ బా – ధ కడు హెచ్చు
ఈ విపర్యయ సృష్టి క – ల్పించు టేల?
బోధపడదు సమన్వయ – గాథ గాదు.

గీ॥ బీదసాదల నెత్తురు – పిండి పిండి
వంటలంజేసి తిని త్రేఁచు – భాగ్యవంతు
లేఁడ? యాఁకలి డొక్కలు – మాడి చచ్చు
ననదలేఁడ? మఱెట్టులీ – శని నశించు.

గీ॥ పురుష కారముఁ గొండాడఁ – బోలునో య
దృష్టములఁ గూర్చి వినుతిఁ గ – ల్పించు టురవొ
యేమిటో వర్గభేదము – లాము బలసి
విషమ విష వీచికలు మ్రింగె – విశ్వమంత.

గీ॥ మధుర విజ్ఞాన సౌధము – లధివసించి
యవస రోచిత కృషిసల్పి! – యార్ద్ర మతులు
బీదసాదల కత్యంత – సాదరమ్ముఁ
జూపఁ గోరుదు కవులార! రేపు మాపు.



ఎన్. శివరామిరెడ్డి

వై.సి.వి. రెడ్డి

# మేనక

# అంకితము

ప్రఖ్యాత విమర్శకాగ్రేసరులు

**స్వర్గీయ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారికి**

# పరిచయము

"మేనక" ఇది యొక చిన్ని కావ్యఖండము. శకుంతలా జన్మమునకు మూలకందమైన మేనకా విశ్వామిత్రుల సమావేశము ఇందలి కథా వస్తువు. విశ్వామిత్రుని తీవ్ర తపఃశ్చర్యకు జడిసిన ఇంద్రుడు తన ఇంద్రపదవి రక్షించుకొనుటకై ముని తపోభంగము సేయుమని మేనకను బంపెననియు, మేనక సౌందర్య వశుఁడైన విశ్వామిత్రుని వలన మేనకయందు శకుంతల జన్మించెననియు బురాణము చెప్పుచున్నది. మహాకవి కాళిదాసు తన నాటకమున శకుంతలా దుష్యంతుల కథను సముచిత సంస్కారములతో దిద్దెనే కాని భరతుని యాభిజాత్యమునకు నిదానమైన శకుంతలా జన్మోదంతము నేమియు స్పృశింపఁ దలపలేదు. పౌరాణిక గాథలోని ఇంద్రుని ప్రయత్నముగానీ, మేనక ప్రవృత్తిగానీ, విశ్వామిత్రుని చాపలముగాని, నైతికముగా నుదాత్తములు గావనియు, భరతుని యాభిజాత్యమునకు శీల సత్త్వముల నింపలేవనియు, నీ కావ్యకర్త తలంచినట్టున్నది. కనుకనే యితివృత్తమును జక్కగ సంస్కరించుకొన్నాడు.

ఒకనాఁడెన్నడో ఇంద్రసభలో వసిష్ట–విశ్వామిత్రులు పంతాలాడునపుడు విశ్వామిత్రుని మహత్త్వమునకు మురిసి ఆయనపై వలపుగొన్నదఁట మేనక. "నాటినుండియు మేనక నవసి నవసి" కడకు దన నాట్యకళా కౌశలముతో నింద్రుని మెప్పించి "సెలవొసగి పంపవలె మౌని సేవజేయ" అని వేడుకొన్నదట. "తపసి తగులములో ద్రవిష్టపము, మమ్ము, మఱతువో యంచు గనుగీటి మఘవుడనిపె"నట. మేనక విశ్వామిత్రునాశ్రమము బ్రవేశించి అతని తీవ్రతపమునకు నుగ్రకోపమునకు భయపడుచు గూడ "ఏది యెటులైన గాము జయింపజాల కలుగుగాకొక్క మేలు నావలన భువికి" అని యనుకొనుచు, మునిని సమీపించెనట. అతడు ధ్యాన సమాధి నుండి కనువిచ్చినపుడతని కనిపెట్టి తన వలపు మెలపు లన్నియు విన్నవించి కడకు "బట్టబయలుగ నిలిచి నాగుట్టు తమకు నప్పనము చేసికొందు గొండంత పెరిగి యెడద నిండిన యజ్ఞాన మిదిగో!

దీని మీ కరస్పర్శ బుడికి పుల్మినను జాలు" అని చెప్పినదట. ఆయన అడ్డముగా దల యాడించుచు "ఓ యమాయకురాల.....సురల నిన్నుబ్బ జేసి పంపగా వచ్చితివి నా తపంబు జెఱుప, బడతి! యానీటికీ బేడలుడుకవింక" అని బిఱ్ఱబిగిసి కూర్చున్నాడట. మేనక యెన్నోరీతుల బతిమాలుచు "సురల దోషములేదు మీ చరణమాన", "మనసులో లగ్నమయ్యె మీ మహితమూర్తి", "ఓ మహామునీ! తపము చేసెదవు నీవు నీ తపము చేతనే గృశనైతివేల?", "ఎట్లయిన గొదవలేదింక నీ త్వదీయ దర్శనము వ్యర్థమును గాదు, తప్ప కొదువు నొక్క చక్కని చుక్క", "ధ్యానావసాన వేళ నెప్పుడో నన్ను బలిగొనుము", "మరునికి దాళ జాల నేలుకొనగదే" యంచునయ్యింతి "పవన చలిత లతవోలె ముని పదాబ్జముల వ్రాలె"నట. యువతీ స్పర్శకు జంకినాడేమో పాపమా తపసి చేతులడ్డు పెట్టగా నామె చేతులపైననే వ్రాలినది. జారిపడునేమోయని యాయన బరువుగా బడిన యామెను బిగువుగా సందిట బట్టవలసి వచ్చినది. ఇంతలో "మెరవువోలె భావమొక టేదియో స్వయం ప్రభవ మగుచు నిగిడి మనసెల్ల మౌనికి నిండికనుట"యు, తరుణి "విచ్చు కనులతో జిఱునవ్వు లిచ్చు"టయు, మౌని "కునిసి కెమ్మోని కసి ముద్దుగొను"టయు "కొంటె కోయిల కోకోయటంచు" పలుకుటయు నేదేదో జరిగి పోయినదట.

ఈ సంస్కారములో నింద్రుని యపరాధము తొలగినది. మేనక దేవదాసీత్వపు నీచవృత్తి మలగినది. మౌని హృదయములో మోహమునకు బదులుగా మానవ సహజమైన మనోధర్మము వెలిగినది. అప్పుడుగూడ నది యొక బలహీనతగాక దైవకారణమైన "మధ్యమ లోకసిద్ధి"గా గవి భావించుచున్నాడు. కనుకనే ముందెన్నడో రాబోవు శకుంతలయు, కణ్వాశ్రమము, దుష్యంతుడు, భరతుడు వీరందఱు నప్పుడే "ఒకసారి తలపులో దిరిగిరేమొ" అని కౌశిక నతీంద్రియ దృష్టిని స్మరించుచున్నాడు కవి. ఈ విధముగా ఈ కథావస్తువు ఉదాత్తముగా సుప్రయోజనముగా దీఱినది.

ఈ సన్నివేశముల నడుమ నిండుగా బుష్పించిన కవితా విన్యాసమంతయు జక్కని ధారతో నిండుకూర్పుతో తీయని పలుకుబడితో అందమైన

యలంకారములతో భావనా సుభగమై యౌచితీ విలసితమై హృద్యముగా బరిమళించినదని ముందు ముందు చదువరులే గ్రహింపగలరు. రకరకములైన రచనలు వెలువడు నీ దినములలో నీ మధుర కావ్యమును జదువ గలుగుటకు నేను మిక్కిలి సంతసించుచున్నాను.

ఈ కృతికర్తయగు చిరంజీవి ఎమ్మనూరు చిన్న వేంకటరెడ్డి ఎవరో గాదు. మా కడప మండలంలోని పులివెందుల తాలూకా బోనాల గ్రామ వాస్తవ్యుడగు రైతుబిడ్డ. ఈ నవ వసంతంలో గల కంఠము లెత్తిన యువకవులలో నీయన యొకడు. ఈయన తొలిరచన "తొలకరి చినుకులు" పచ్చని పంటపొలములో మంచెలపై గంచు గంటలు మ్రోయించు నీ కంఠము కావ్యోద్యానములో గమ్మని భావగీతము లాలపించుట ముచ్చటయే గాదు, మెచ్చుకోదగినది. ఎందుకనగా మానవజాతి కడుపు నిండించుటకంటె హృదయము పండించుట యుత్తమ కృషిగా నీయన తలంచెనేమో యనిపించును. కీర్తిశేషులైన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి ప్రతిభకీ కృతినంకితము చేయుట యందుగూడ నీతడు తనచేయు పనియందు వివేచనాయుతమైన దూరదృష్టి నెట్లుపయోగించునో మనకు గోచరింపగలదు. ఇట్టి భావుకులగు రచయిత లిప్పుడెందఱో మనకు గావలసియున్నారు. వీరిని వీరి కావ్యముల నాదరించి ప్రోత్సహింప వలసిన యావశ్యకతయు, బాధ్యతయు ప్రజలపై ప్రభుత్వముపై నిప్పుడెంతేనియు గలదు. ఈ సన్నాహమంతయు ముందు ముందు అవిచ్ఛిన్నముగా జరుగగలదని యాసించుచున్నాను. యీ యువకుడిట్లే యెన్నేని మంజుల కావ్య గుచ్ఛములతో నాంధ్ర సరస్వతి నారాధించు గాక! యని యాశీర్వదించుచున్నాను.

ప్రొద్దుటూరు **గడియారము వేంకట శేషశాస్త్రి**

20 - 8 - 54

# అభిప్రాయము

చాలామంది ఖండకావ్యకర్తలు అభిప్రాయమిమ్మని యడిగినపుడు మనసులో భయమగును. కారణమేమన వ్రాయుట కిష్టముండదు. వ్రాయకతీరదు. నేటి నవ్య కవులలో చాలామంది అవ్యుత్పన్నులు. అసంస్కృతులు. ఉబలాట మున్నంత శక్తి యుండదు.

ఎమ్మనూరు చిన్న వేంకటరెడ్డి అడిగినదేతడవు "వ్రాసియిత్తు" నని సంతోషముతోనన్నాను. ఈ గ్రంథమునకుకెవ్వరి పీఠికయునక్కర లేదు. నా "తొలిపలుకు" ఆవశ్యకముగా నుండవలెనని తోచినది. ఎందుకనగా అది నాకు గౌరవము. ఇంత చిన్ని కావ్యములో నింతసౌందర్యము నిముడ్చుట సామాన్యమైన శిల్పముగాదు.

వ్యుత్పత్తి ప్రయత్న సాధ్యము. సంస్కారము దైవదత్తము. ఈ కావ్యమున సంస్కారము పద పదమునకున్నది. వ్యుత్పత్తి సంస్కారమును ద్రోసిరాజనకుండుటీ కావ్యములోని మహాగుణము.

సంస్కారి అదవ బ్రదుకు బ్రదుకడు. పద విన్యాసములు ప్రాతవేయైనను, గ్రంథన కౌశలము పురాతనమే యైనను తన ప్రత్యేక ముద్రనాతడు వైచితీరును. విశ్వామిత్రుని కీర్తి స్వర్గమునకు వ్యాపించినదనుటకు కవి "నందనో ద్యానతరుల బూవులై విచ్చె దద్గుణా మోద మెసగ" అన్నాడు. ఇది క్రొత్త భావము. అనగా నితడు సంస్కారి యనుటకు గుర్తు. అట్లే మేనకాదేవి వలపు, గంగానదివలె "స్వర్గము నుండి పుడమికి వచ్చెనట" మేనకా ప్రేమను గంగకు బోల్చుటలో నెంతధ్వని యున్నది. పూర్వపదమును గుణామోద మెసగ యను పదము శ్లిష్టమగుటయేగాక యుభయార్థములందును నెంత సార్థకముగ గుదురుకొన్నది. ఈ కవిప్రతి భావము నిట్లే వాడును నియమ కర్కశుడైన విశ్వామిత్రుడు "భవుని మూడవ కన్నంత వాడట!" భావమెంత క్రొత్తగా నున్నది! ఈ గొప్ప భావమును

యింత సులభతరమైన భాషలో సందర్భ శుద్ధితో జెప్పిన మనుష్యుడు "మహాకవి" గాక మరేమగును? ఈ బృహద్గ్రంథ కర్తలు యిట్టి వెన్ని భావములను దమ కావ్యములలో జెప్పగల్గినారు. ఒక కవి తన జీవితములో నిట్టి భావములు పట్టుమని పది చెప్పిన జాలును. వాని బ్రదుకు ధన్యము. పైగా కవి యీ కావ్యము నందలి పాత్రలకు మాహావర్చస్సు నిచ్చెను. మేనకా విశ్వామిత్రుల త్యాగములు పరస్పరము పందెములు వేసికొన్నట్లున్నవి. మౌని త్యాగము మధ్యమ లోకసిద్ధియట! ఔరా విశ్వామిత్రుని క్రాంతదర్శిత్వము!

ఈ కవి తన కావ్యమునకు గీతపద్యము లేరికొన్నాడు. కొంద ఱశక్తులై గీతములు వాడుదురు. ఇతడు శక్తుండై వాడెను. ఆ ఛందస్సున నాతడు జూపిన మెరపు లెందఱు కవులో ఒరవడిగా నుంచి కొనదగినవి.

ఈ కావ్యము నా దృష్టిలో తెనుగున కలంకారము. నేను గోరున దొక్కటే. ఈ కవి దీర్ఘాయుష్కుడై యిట్టి కావ్యము లనేకముల వ్రాయవలెను. ఆ యదృష్టము భగవంతుఁ డొసంగుగాక.

కడప                                        ఆశీః

15-8-54                                     **పుట్టపర్తి నారాయణాచార్యులు**

# అభిప్రాయము

నాయికామణి విబుధ జేగీయమాన
గాయనీ లోకమునకు శిఖాభరణము
అచ్చరలలోన రెండవ మెచ్చులాడి
యోగిజన చిత్తసత్తున కొఱపుఁ గల్లు
ఎలమి బలవైరి చదరులో నృత్యగతులఁ
గొలువు సింగార మొలికించు కులుకుబొమ్మ
మేనకాదేవి -----యీ కృతి మాననీయ
నాయకోత్తముడో! అగ్ని నయనమాఁగి
యోగమున నున్న సాక్షాత్తు నాగ కంఠుఁ
డౌర! గాధేయుఁడాతని యగడు పఱుపఁ
దలఁచి బలవైరి పనిపె నా గలువ కంటి.
నిరువురకు లోక హితమైన పరువుఁ గూర్చి
యాలు మొగలకు గల తందనాల గొలుసు
కొలికి ముడివైచినావెంత కలికి తనము!
హలము కలమును బట్టిన పొలము కాఁపు
కమ్మఁ దనమందు నా నీదు కైతలోని
కమ్మదన మింత యొప్పునే! కమ్రవాణి
నలువ రాణికి నీమీఁద ననలు సాగు
బుఁత్ర వాత్సల్య లతకిది పూవుసుమ్మి
దొడ్డకవివౌదు వై.సి.వి. రెడ్డి సుకవి.

కడప **యు. వేంకట నరసయ్య**

6-8-54

# అభిప్రాయము

కవకువలు బల్కి చెవిలోన, కమ్మతావి
హైమకంకణ మంద్రస్వనాళి నెనయ
కొసరి వీవన వీచి జోకొట్టఁజాలు
నీదు మేనక మిత్రమా నిజము బలుక.

ఇది వసంత రసాల ముదిత మేచకపికీ
నాదోక్త మధుర వీణారవంబొ!
ఇది మేఖలానాద మృదుతరోక్తిని గూడి
మదికింపు నింపెడి మణిత రవమొ!
ఇది తమ్మికాడు భృంగీ నాదమున గూడు
సెలయేటి మర్మరాశీర్వచనమొ!
ఇది మదిరాపాన మృదులాంగి నూపుర
ధ్వని గూడు బకదారి నినద మొక్కొ

ఇది మహానట జాట జూటీ విటంక
పతిత స్వర్గాంగ ఘుమ ఘుమాయిత రవ ప్ర
సంగ భృంగీశ హస్త సంసక్త డమరు
ఢమ ఢమా రావ మేదురాడంబరంబొ!

కడప మకాం.
15-8-54

**ఆర్.బి. కొండారెడ్డి**

# కృతజ్ఞత

మహర్షి విశ్వామిత్రుని జీవితము ఉల్లోల కల్లోలమైన మహాసముద్రము వంటిది. ఆ మహనీయుఁడు తన జీవితమున పట్టుదలతోఁ సాధించిన మహత్తర కార్యములు పెక్కులు. ఒక సామాన్య మానవుఁడుగా, మహారాజుగా, మహర్షిగా, లోకకల్యాణమునకు దోడ్పడిన మహానుభావుండు ఆయన. మానవుడు సాధించలేనిది విశ్వమున లేదని ఋజువు చేసిన స్రష్ట విశ్వామిత్రుడు. ఆ మహాత్ముని పాత్రపైనున్న గౌరవ భావమే నా యీ కావ్యము – "మేనక".

"మేనక" తెలుగు వారి మన్నన లందినచో ధన్యుడను. నా యీ కావ్యము రెండవ ముద్రణ భాగ్య మందుకొనడము నా యదృష్టము.

"మేనక"ను సారస్వతోపాసకులు, ప్రఖ్యాత విమర్శ కాగ్రేసరులు విద్యావేత్తలు అయిన స్వర్గీయ కట్టమంచి రామలింగారెడ్డి గారికి స్మృతి చిహ్నముగ నంకిత మొసఁగి ఋణవిముక్తుడనైతిని.

ఈ కావ్య నిర్మాణమున నాకు దోడ్పడి ప్రోత్సహించిన మిత్రులకు నా కృతజ్ఞత.

ఆంధ్రసాహితీ ప్రపంచమున నిరంతరము దేదీప్యమానముగ వెల్గుచున్న యాశాజ్యోతి మహాకవి శ్రీ గడియారము వేంకట శేషశాస్త్రిగారు నా కృతి క్షుణ్ణముగ పరిశీలించి పరిచయ వాక్యములు వ్రాసి నన్నభినందించి, యాశీర్వదించిరి. వారికి భక్తితో నమస్కారము లర్పించుకొనుచున్నాను.

సారస్వతోపాసకులు, బహుళ గ్రంథకర్తలు, విశేషించి నాకుఁ గూర్చు కవ్యగ్రణియైన శ్రీ సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులుగారు, నా "మేనక"ను చూచి సంతోషించి, వారి యభిప్రాయ మొసఁగి ప్రోత్సహించిరి. వారికి నా హృదయ పూర్వక నమోవాకములు.

నా కత్యంత ప్రియతములు, ఆంతరంగిక మిత్రులు అయిన శ్రీ యు. వేంకట నరసయ్యగారు, శ్రీ రాచమల్లు భైరవ కొండారెడ్డిగారు, మేనకపై వారి యభిప్రాయముల నొసఁగి నన్నుత్సాహ పరచిరి; వారికి నా కృతజ్ఞతాభి వందనములు.

కడప, ఇట్లు భవదీయుడు,

10–10–56. **వై.సి.వి. రెడ్డి.**

# మేనక

నిశ్చల సమాధి నియతిమై నిలిచి తపముఁ
జేసి శాంతిని బంచి సంతోసమూని
దేశహితకాంక్ష నుండె నా కౌశికుండు
వాఁడెపో దేశికుఁడు ప్రాఁకె వానికీర్తి॥

వాని కీరితి స్వర్గలోకాన వాడ
వాడలందు నెసఁగుటేమి చేడెలెల్ల
నాడి పాడఁగ నందనోద్యాన తరులఁ
బూవులై విచ్చెఁ దద్గుణామోద మెసఁగ॥

అప్పుడొక యప్సరాంగన యంగజుండు
మొనసి భావుకమౌ కళార్చన విభూతిఁ
దీర్చి దిద్దిన బంగరుతీవ యనఁగ
మేనక వసించి స్వర్గలోకాన మించి॥

ఆ లతాతన్వి కౌశికుఁ డాచరించు
ఘనత రామోఘ తపమున మనసువెట్టి
వలపు నిలపెను; ముల్లోకములను గెలువఁ
జాలు సాత్విక సంపన్ను చనవు కొఱకు॥

పుణ్యధనులును సంపూర్ణ బోధయుతులు
ఋషులకోవకుఁ జెందిన ఋషితిలకుని
గాధిపట్టిని వరియించి గాఢవాంఛఁ
జిక్కి మేనక వెతలంది చెన్నుదరగె॥

నాఁటినుండియు మేనక నవసి నవసి
మానసిక బాధ ముమ్మరమై సలుపఁగ
దేవసభకేఁగు విధినైనఁ దేలికఁగని
కలవరింతలఁ గాలంబు గడుపుచుండె॥

పలవరింతలె యే విభావరినిగాని
చొక్కుగొని నిద్రవోవదు, మిక్కుటంపు
వెతలు గలుగుట సహజమే వెలఁదికైన
మరులుగొని మగలఁ గోరుట మనికితంబు॥

ప్రకృతిలో నిత్య నూతన ప్రకృతులెల్ల
సానుభూతినిఁ బ్రకటించి సాదరముగ
స్మృతుల నెంచుచుఁ బలవించె నతివమిన్న
మదిని వలవంత లలమఁగ మాపు రేపు॥

నందన వనంబులోని యానందమెల్లఁ
గొల్ల గొనివచ్చు మారుతాంకురము గూడ
నతివకు విషాద వేధనోన్నతి ఘటించి
సాగుచున్నది భూమి సారగతిని॥

జంతి సౌందర్యమయ వస్తు చయములెల్ల
మదికి సంతోష మొనగూర్చు మనసు విఱిచి
శోకమును గూర్చు మనలోని శోకమోద
వికృతులే కాని హేతువుల్ వేరుకలవె॥

చెఱకు విలుకాని పూవుటంపఱకు గ్రుగ్గి
మై పులకరింపఁ జంద్రుఁడు మందలింపఁ
బదను వెట్టుచుఁ గోయిల పాట పాడ
సొంపు సెడుటేమి మేనకే పెంపు సెడియెఁ॥

పెంపు సెడి పూలపానుపే యంపసెజ్జ
గా, నిలువలేక మనసు చిక్కగొనలేక
వలపు కడలిలో నాశయన్పడవ నెక్కి
తెఱువెఱుంగని బేలయై తిరుగుచుండె॥

చలువ వెన్నెలల్గురియించి సర్వజనుల
కవ్యయానందమిచ్చు చంద్రాతపంబు
దిక్కుమాలిన మేనకా దేవిపైన
కక్కసింపుచు వలవంత నుక్కళించె॥

"ఆ కటిక బ్రహ్మ నన్నేల యాడుదానిఁ
గాఁగఁ బుట్టించె నేల యీకాలకూట
మందు నెట్టించె నతఁడు దయార్ద్రహృదయుఁ
డను టబద్ధమె" యనుచు బెల్లదవదించు॥

దూఱు వలవంతఁ గుందు నవ్వారిజారి
శీతకరముల వేడికిఁ జెదరు బెదరు
బెట్టు నిట్టూర్పులను గ్రాఁగు విరుల సెజ్జ
నంటి పొరలాడు నవ్వేల్పు టన్ను మిన్న॥

కాంక్ష యగ్గలమై మదిఁగలఁతఁబెంప
నావు నావురు మనుచుఁ బెల్లార్తిగుంది
చేటి నొకదానిఁ బుత్తెంచెఁ జెంతనున్న
పరమలావణ్యరాశి యూర్వశినిఁబిలువ॥

గుండె దడతోడ నచ్చేటి మండనములు
సరకుసేయక కురులను జక్కనొత్త
కమితవేగంబ యూర్వశీహర్మ్యమునకు
నరిగి రోజుచు నిలిచె నా గరితముందు॥

హృదయమున భావఘర్షణ మినుమడింప
నేమియును జెప్పలేక వీక్షించు బోఁటి
ననునయించుచు నూర్వశి యడిగె నపుడు
చేటికానీత వార్తా విశేషములను॥

ఏమె! యేమైన దిప్పు డే కామితంబుఁ
దెలుప నారాటపడెదు నీదేవి సుఖమె!
యసురు లేమైన దండెత్తి యమరపురికి
వచ్చిరా? చెప్పలేవేమె యచ్చుపడఁగ॥

అనుచు వేగిరిపాటున ననునయించి
యడుగు నూర్వశి వలన నాయాస ముడిగి
చెప్పమొదలిడెఁ దన దేవి ముప్పులెల్ల
మొదటినుండియు నేఁటి యాపదల దాఁక॥

అమ్మ! మాదేవి గోలయై యడవులందు
నిష్టఁ దపమాచరించు మౌనికులభూషు
గాదిపట్టిని వరియించి గాఢ విరహ
వేదనాదూయమానయై వేగుచుండె॥

అతి విశాల మగాధమై గతిదెలియని
ప్రేమవార్థినిఁబడి మున్గి బాముఁజెంది
జీవితాంతముఁగనఁ బోవు తీవవోలె
స్రుక్కి వెక్కసపడుచు నాదిక్కుఁజూచి॥

తెరువెఱుంగని ననుదేల్ప వెఱపుమాన్ప
క్రమకరముల ననుముట్టి కామితములఁ
దీర్ప ననువైన మార్గము దెల్ప నిటకు
నూర్వశిని దోడితెమ్మని యువిదపలికె॥

అచ్చు వెన్నెల క్షణములో నస్తమింపఁ
గాఋ చీఁకట్లు నలుమూల గ్రమ్మినపుడు
పగులకుండనె గుండె లీవగలమాన్ప
రమ్ము జాగేల దక్షింపవమ్మ మమ్ము॥

కంతుఁడు వసంతుఁ డతని సామంతులెల్ల
నెల్ల బలముతోనేచి దండెత్తినారు
మృదువులన్నిట మెదిపిన హృదయ సుమము
పొడిపొడిగఁ బోవు రావమ్మ తడవులేక॥

గాటమౌ వేడి నిట్టూర్పు గాడ్పుసోకి
యధరపల్లవ మందు బొంగారు నమృత
మిగిరిపో బీటవారు నాచిగురు నింకఁ
జూడలేనమ్మ! రావమ్మ! సుదతిఁ బ్రోవ॥

లోతులెన్నిన ఫలమేమి? గోఁతిలోని
ప్రాణిఁ బైకెత్తి రక్షింపవలయుఁ దల్లి
కొమ్మ కళవళంపడి ప్రేమ కూపమందు
పడిన దటనుండి రక్షింపఁ గడఁగుమమ్మ॥

వలపు నిలిపిన మేనకా వారిజాక్షి
కలుపు గోలు తనంబెల్లఁ గరిగిఁ దివిని
బరమ గంగా ప్రవాహమై పాణి కడకు
భూమిపై దూకుచున్నది పువ్వుఁబోఁడి॥

వేగమాకట్టరానిదై సాఁగిపోవు
వలపువాహిని యే మార్గములను దవిలి
వెతలె కతలుగ సాఁగి యే వితము గనునొ
త్రోవఁ జూపఁగరావమ్మ బ్రోవవమ్మ॥

భావ గంభీర హృదయ తాపమునఁ గమిలి
కుమిలి పోవుచు నున్న దా సుమశరుండు
నుగ్గనూచగ శరముల నొంచుచుండె
భావిగతి నెంచి రక్షింపు వారిజాక్షి॥

తడవు సేసిన మేనక యెడఁద, కోర్కె
కొలిమిఁ గరఁగియు సమ్మెట కొట్ల నలుగు
అంటఁగూడ దీవెత వెన్నవంటి మదికిఁ
గలువకంటి; నీచెల్లెలి గావుమంటి॥

అనుచుఁ బలవించి మొఱపెట్టు నబలవెంట
పదముకంటెను మది ముందు పరువులెత్త
పద పదమటంచు నూర్వశి కుదురు లేని
గునుకపరువున మేనక యునికిఁజేరె!

చేరి పర్యంకమున మేనుఁజేర్చి పొరలు
భామినీమణిఁ గదిసి యూర్వశి విషణ్ణ
వదన లులితాలకల చిక్కువాపి తీపి
మాటలను బుజ్జగించి సేమమ్ములడిగె.

మేనకా! యెంతబేలవె! పూని యెట్టి
వానిఁ గోరితివే! చేవఁబాటినట్టి
మౌని కౌశికుఁడాతని మతమె మతము
భవుని మూడవ కన్నంతవాఁడతండు.

వాని నిశ్చలచిత్తమ్ము వానిత్యాగ
మేరికిని లేదటంచు నవ్వారిగాఁగ
నాడుకొనుటలు వినుచు నీయాటలేలె?
కుడిచి కూర్చుండకీ వట్టిగొడవమేలె?

అనెడి యూర్వశి యనునయంబందుకొనుచు
భావఘర్షణచే ఱిచ్చపాటు గనుచుఁ
గంపమాన శరీర శుష్క తరహాస
యగుచు మేనక తన్ను దా నాదుకొనుచు.

చెప్ప మొదలిడి, పుయిలోడి కప్పుదేరు
సోగ కురులెల్ల మూఁపునఁ దూఁగుచుండ
నవతరించిన దీనత్వ మనఁ గపోల
తలము చెమరింప నిటులామె పలుకఁ దొడఁగె॥

వెతలు గుడువగ శాసించి మతిఁ గలంచి
అంగ సౌష్టవ మలయించి భంగ పరచి
బిఱుసు తనమున మదనుఁడు దురుసుఁ జూపి
తఱుము చున్నాఁడు దయమాలి తలిరుఁబోఁడి॥

కాన నెట్టైన నన్ను నాగాధిపట్టి
కరములం బెట్టి పుణ్యము గట్టుకొనుము
మానసంబున నీమేలు మరువఁబోను
పాకశాసను నర్థించి పనుపు నన్ను॥

అనుచు బ్రార్థించు మేనక యలత వాయఁ
గమ్రకరముల నిమురుచు గలువకంటి
శ్రమముడుపు కార్యసాధన క్రమమునెంచి
యతివ కూఱట గూర్ప నిట్లనుచుఁబల్కె॥

చెలువ! బ్రహ్మయు నెఱుఁగుఁ గౌశికుని దుడుకు
నతని పేర్విన్న దేవతలైనఁ గాని
వడఁకి పోదురు, వానికై వనటఁజెంది
యింద్రు వేడగఁ బొమ్మందు వేమి సేతు॥

వాసవుఁ "డసాధ్య మీపని వలదు సాహ
సము, తలంపకు మగ్గితో సరస" మనుచుఁ
బల్కి తప్పించుకొనునొ! యేపగిది యగునొ!
ఇంద్రుదయ నీ యదృష్టమో యిందువదన॥

"శక్తి వంచన లేకుండ యుక్తి నెఱపి
కార్య సఫలతకెల్ల మార్గములు నడతుఁ
జేయఁగల సాయమంతయుఁ జేయుదాన
నూఱడుము నన్నుఁ బనిగొను మువిద" యనుచు"

అనునయించెడి యూర్వశి ననుసరించు
తలఁపు మెలపునఁ దలయూఁచి తరుణి పలికె
మఘువు నెట్లైన మెప్పించి మదిఁగలంచు
కామితము దీర్చి పున్నెంబు గట్టుకొనవె॥

కౌశికునితోడ నెట్లైనఁ గలిసికొందుఁ
గలిపికొందు, నా భాగ్యంబు నిలిపికొందు
వలతు వలపింతు నాకుఁ దోడ్పడు మహాత్ముఁ
డొకఁడు గలఁడా ప్తుఁడా ర్తరక్షకుఁడు చెలియ॥

గాధిపుత్రకుఁ డర్థుల కల్పవృక్ష
మట్టి త్యాగశీలుని వేడనతుల సుఖము
లిచ్చు కౌగిట మన్నించు నింతనిజము
తప్పెనే నది తలవ్రాఁత తప్పదబల॥

అమ్మ దేవేంద్రు నెట్లైన సమ్మతింపఁ
జేసి నావెతల్దొలగింప సిద్ధపడుము
తనదు భృత్యుల నాపదఁ దవులనీని
ప్రభువు దేవేంద్రుడిది కొంచె పరచఁడమ్మ॥

మనసులోనున్న నెగులు నీ మనసునాటఁ
బల్కి నాబరువెల్ల నీపైని నిడితి
నింక ననుబ్రోచు దైవమీవేయటంచుఁ
బలుకునప్పుడ దేవేంద్రుబంటువచ్చె॥

వచ్చినాతనిఁజూచి యవ్వారిజాక్షు
లమిత సంభ్రమ చపలాక్షు లగుచునుండ
మేనకను జూచి దైవతేశాను దూత
వినయ వినమితుఁడై యిట్లు విన్నవించె॥

అమ్మ! త్రైలోక్యపతి సభాభ్యంతరమున
నిందు కొలువిచ్చె నెల్లమన్నీలతోడ
సమయమైనది చతుర లాస్యప్రయుక్త
సరస సంగీతములఁ గొల్వు సందడింప॥

'అప్సరో రత్నమగు మేనకాబ్జనేత్ర
కొలువు పులకింప నిపుడ రావలయు ననుచు
ముదల యైనది' నీ భాగ్యములు ఫలింపఁ
గదలి రాఁగదవమ్మ! బంగారు బొమ్మ॥

అనుచు మరలెను దూత పొమ్మనియె నూర్వ
శీలతాతన్వి నెయ్యంబు చివురులెత్త
మనసులో సందడించు మర్మరము తొత్తి
కదలె మేనక క్రొత్త సింగార మొలుక॥

ఒత్తుకొనివచ్చు భావసంపత్తి దోఁగి
తనులతిక క్రొత్త ననలెత్త తలిరుఁబోఁడి
చలువ పన్నీటి తావుల జలకమాడి
మరుని యారవ బాణమై మరులు గొలిపె॥

తళుకు హొంబట్టు జిలుఁగు దువ్వలువలోన
సవసవల నీను పైఠిణీ అవికలోన
నుల్లిపొరవంటి కండువా వల్లెవాటు
ముసుఁగులో మేనియొప్పిదమ్ములు చిగుర్ప॥

కనులఁ గాటుక, మగఱాల కమ్మజోడు
చెవులఁ జెక్కుల మకరికా చిహ్నములును
పాలతిలకంబు, మేన జవాది పునుఁగు,
గండములపూఁత గమగమల్ గ్రమ్ముచుండ॥

చారు సౌందర్యమున కలంకారములకు
జీవకళలై యొయారముల్ హావభావ
చేష్టితము లందగింపఁ గైసేసి నడచె
గాధి తన యాపహృత మనః కమలయగుచు॥

సకల భాగ్యమ్ములకు తావు సర్వసౌఖ్య
ములకు నెలవు చతుష్షష్ఠి కళలగీము
పరమ మౌనులు కొలువున్న పదము కరము
విభవములనొప్పు దేవేంద్రు సభనుజేరె॥

జిగి నలేఖ్యతనూ విలాసిని యనంగ
విభవసామ్రాజ్యలక్ష్మి యావికచనేత్ర
సభ్యుల యెడంద లుఱ్ఱూచి సవినయముగ
నవనతాంగియై మ్రొక్కె వాసవునిమ్రోల॥

వేయికన్నులఁ జిఱునవ్వు విచ్చు కొనఁగ
నాదరమున మేనకఁ జూచి యమరవిభుఁడు
"మధుర సంగీతనాట్య సంపదలు వెలయ
సుదతి! యొకభావ మభినయించుమి" యనంగ॥

వల్లెయనునట్లు తలయూఁచి వల్లెవాటు
ముసుఁగుఁ దొలఁగించి కనురెప్పముసుఁగులోని
కలికి చూపుల మల్లె పూవులు వెలార్చు
చెలువమునఁ గేలుమోడ్చి సభ్యులకు మ్రొక్కె॥

కాల గజ్జెలందియలు ఘల్ ఘల్లురనుచుఁ
గేలఁ జిఱు తాళములును దక్కిట కిటంచుఁ
దమి మృదంగముల్ దిద్ధిమి ధిమియటంచుఁ
గెరలి హృదయముల్ జిక్కిలిగింత గొలిపె॥

అంగభంగిమల్ హస్త విన్యాసములును
గనుబొమ బెడంగు తుంటరి కలికిచూపు
మోవి చిఱునవ్వు తలయూఁపు ముగుదపాట
లొలసి యెల్లరమదుల నుఱ్ఱూఁత లూఁచె॥

సరసి జనియించు తరఁగల నొరసి యూఁగి
మొనల నరవిచ్చు మొగ్గల గునిసియాడు
పద్మలతవోలె మై దీవె పరువ మొలయఁ
గలికి మేనక నాట్య కౌశలము నెఱపె॥

ఉన్నతంబగు గిరి శిఖరోపలముల
నొరసి దుముకుచు మెలికల నోసరిలుచు
నాటలాడెడి సెలకన్నె ననుకరించి
లాస్య మొనరించె మేనక లలిత గతుల॥

సాగర తరంగముల తోడ సాఁగి తూఁగి
నిగిడి నర్తించు నాఁగు కన్నియ ఫణాగ్ర
మున వెలుంగు మణి ప్రభల్ ముంచిపోయు
తళుకుఁ జూపుల మేనక తాండవించె॥

విశ్వసమ్మోహనంబు గల్పించు నాట్య
భంగిమలు పూఁచి యా సభా భవనమెల్ల
మెఱపుఁ దీవల తళతళల్ మెండు కొనఁగఁ
జలిత వలయితో భ్రాంత లాస్యములు నెఱపె॥

నిలిచి కనువారి కనుల వెన్నెలలువోసి
సొగసి వినువారి చెవులలో సుధలు జిలికి
తలఁచి మరియు డెందముల కౌఁగిలికిఁదాటి
చంద్ర కళవోలె మేనకాప్సరస యాడె॥

మోహన స్తంభనాదులు పూవుటమ్ము
లైదు నొకసారి సంధించి యాస్మరుండు
పఱపె నాఁగల్కి చూపు టంపఱ వెలార్చి
కొలువు కొలువెల్ల నిలువు బొమ్మలుగఁ జేసె॥

స్విన్న వదనము నసియాడుచున్న కౌను
గ్రక్కదలుచున్న పిఱుఁదులు కలికిచూపు
వలుద పాలిండ్ల పైటపై మలయునూర్పు
లొలయ మేనక నాట్యము నిలిపి నిలిచె॥

ముకుళిత కరాబ్జయై సాఁగి ముందు నడచి
మఘవునకు మ్రొక్కి నిలిచె నమ్మందయాన
అనుపమాపూర్వ శోభలంఁ దనుపుగూర్చు
నామెఁగని దేవతా నాధుఁడనియె నిట్లు॥

మేనకా! యెట్లు నేర్చితివీ నటనము!
నీదు చాతుర్యమునఁ గొల్పు నిస్తరంగ
జలధియై పొల్చె మామది సంతసించెఁ
గోరుకొమ్మేమి వలయినో సారసాక్షి॥

అనుడు మేనక మోమోటమున మునింగి
తరము మాలిన సిగ్గు దొంతరలుగట్టఁ
బలుకకుండెఁ దద్వైఖరిఁ దెలిసి కొలువు
విడిచిచనె నింద్రుఁడామెయు వెంటనంటె॥

అపుడు మేనక దేవేంద్ర నాజ్ఞఁగొనఁగఁ
దలఁచి "స్వామీ! యిఁకేమి నాతలఁపుపండె
మీయనుగ్రహమయిన నేచేయఁబోవు
పనికి ననుమతిఁ గోరుదు" ననఁగవజ్రి॥

"సంశయము మాని కోరుమో సరసిజాక్షి
యేదియెట్లైన నిచ్చెదఁ గాదననిఁకఁ
గోరుటేతడ" వన్న నంభోరుహాక్షి
వలపుకథఁ జెప్ప మొదలిడె వాసవునకు॥

"దేవ మీబోటి వారికిఁ దెలుపఁ దగిన
కోర్కె కాదౌటఁ బలుక సంకోచపడెదఁ
జల్లకై వచ్చి ముంత దాచంగనేల
తమ యనుగ్రహమున్న నాతపముపండు॥

అలవశిష్ఠ విశ్వామిత్రు లాదినంబు
సత్య నిరతికై పందెముల్ చరచు నపుడు
గెలువఁ దలపడు గాధేయు కలిమియెల్లఁ
దలఁపులోనిల్చి నామది విలిచికొనియె॥

నాఁటి నుండియుఁ గౌశికు నా యెడంద
నిలిపి పూజింతు నా తలంపులు ఫలింప
నమ్మహాత్ముఁడె యిపుడు బ్రహ్మత్వమునకు
ఘోర తపమున నుంట మీకును విదితమ॥

అమ్మహాత్ముని తపము తీవ్రాగ్నికీల
లా జగమ్ములు నిండఁబై నలము కొనియెఁ
గీర్తి చంద్రికల్ నునుగెంపు కిసలయముల
పొదిగిటన్నిక్కి యరవిచ్చు మొగ్గలట్లు॥

అతుల తేజస్వియగు నమ్మహా తపస్వి
సకరుణా పాంగమభయ హస్తము ప్రసన్న
చిత్తము లభింపఁ గొన్నాళ్ళు సేవఁజేయఁ
దలఁపు గల దది మొగ్గలో వలపు కరణి॥

దేవతా సార్వభౌమ! మీ సేవకింత
సెలవొసఁగి పంపవలె మౌని సేవఁజేయఁ
దను మనో జన్మములు గృతార్థములు గాఁగ
మరలివత్తు మీదాసికీ వరము నీవె॥

అనుచు మేనక దీనయై వినతిఁజేయ
నాకపతి సుంత యోచించి "నాకుఁ గూడ
నిది సహాయమ! కౌశికు మది కలంచి
తపముఁ జెఱుపఁగా నిది మంచిదారి" యనుచు॥

"కోరవలసిన కోర్కెయే కోరుకొంటి
వబల! నీకుఁ బ్రియంబె మాకభిమతంబు
కౌశికుండేమి నీకు ముక్కంటి గూడ
వశుడగును బోయి ర"మ్మని వరమొసంగి॥

పట్టు విడుపులఁ జెప్పి తాపసవరేణ్యు
గత చరిత్రముఁ దెలిపి సంగతము లెంచి
తపసి తగులములోఁ ద్రివిష్టపము మమ్ము
మఱతువోయంచుఁ గనుగీఁటి మఘవుఁడనిపె॥

అమృత వర్షము గురిసి నట్లాత్మఁ దనిసి
కనుల చిఱునవ్వుతో సురేంద్రునకు మ్రొక్కి
పసదనములతో వీడ్కోలు వడసి వెడలెఁ
దరుణి చిరుగాలి మొగలి పూఁదావివోలె॥

మంచి పన్నీటితొట్ల నిండించి చెలులు
జలక మాడించి కేశపాశములనార్చి
యగరు ధూపములిడి నిల్వుటద్దమెదుట
నునిచి మేనకన్ గై సేసి రుత్సవమున॥

జిలుఁగు వలువలుగట్టి పూవులనుముడిచి
నగలుగై సేసి మేనగందములలంది
కంతుశరమన నప్సరఃకాంత యపుడ
సఖులు వెంటరాఁ గౌశికాశ్రమముఁజేరె॥

మలయ పవనుఁడు దనరాకఁ దెలుపుచుండఁ
గలికితేంట్లు ఝుం ఝుమ్మని పిలుచుచుండ
మేని తావి గుబుల్కొన మేనకా వ
ధూటి యల్లనఁ దపసి ముందునకుఁ బోయె॥

గండశిలకు నైశ్చల్యంబు గఱపునట్లు
మ్రోడులకుఁ గూడఁ జివురులు పుట్టునట్లు
బద్ధ పద్మాసనమున నిర్భర సమాధిఁ
దపము సేయు గాధేయునత్తన్వి సూచె॥

దీపిత తపఃప్రభావ దేదీప్యమాన
వదనమున బ్రహ్మవర్చ సముదయరాగ
దీధితి వెలార్చి ధ్యాన సుస్థిరతనున్న
కౌశిక మునీంద్రుఁగనె మేనకావధూటి॥

మలయపవను పచారు కల్వలబజరు
కోయిలలహెూరు తుమ్మెద కొదమబారు
మేని గమ గమ సౌరుతో మీఱి మునికి
మరు కటారులై సోక నమ్మగువ గాంచె॥

సకల సౌందర్యములను మేనక కొసంగి
నలువ సృష్టింపఁగా నామె నైజశోభ
నవ్వనమునెల్ల వింత సోయగమునింద
నిలిచి మునిఁజూచి తలయూఁచి తలఁచెనిట్లు॥

మనుసులో నేమి తలఁచెనో మునివతంసుఁ
డెండవానలకోర్చి యీ కొండచరుల
గుహల వనుల నిరాహార ఘోరవృత్తి
నిట్లు తపముండె నితఁడు నన్నేలచూచు॥

చూచెడుంగాక తనలోని చూపుచేత
జగదరిష్టము లెఱిఁగి ప్రశాంతిఁ గూర్చి
శివముఁ బంచెడి యతని ప్రాభవముఁ జెఱచి
వలపుఁ దగులముఁ గూర్చు నాతలఁపు తగునె?

జగముఁ గాఱించు బుద్ధి వీసమును లేక
యమరలోక సుఖాలకై యాసలేక
మోక్షకామున తపముండు మునులపైకి
స్మర విజయ దండయాత్ర లచ్చురలకేల?

క్రూరమృగములు సైతము కూర్మినెనసి
శాంతి భావము లెడఁదలఁ జాలువాఱఁ
జేరిసేవించి యుపకృతిఁ జేయుచుండ
నపకృతిఁ దలంచుటెంత యన్యాయ వృత్తి॥

సహజ వైరములుడిగి రోసములు మరచి
యాశ్రమో పాంతములc గాచు నట్టిభటుల
కరణిc దిరుగాడు నీ జంతు గణముcజూచి
యైనc బెద్దల సేవించు టరయ వలదె?

క్రమ పవమాన చలిత శాఖాకరాగ్ర
పల్లవాంగుళులెత్తి యీవనలతికలు
మునితపము విఘ్న మొనరించు పూన్కి యుడుగు
మనుచు నన్ను వారించుచున్నవియొ యేమొ॥

చలువ నీడయు ఫల పుష్పములు నొసంగి
ప్రాణికోటిని దనుపు నుపాంత తరువు
లతిథినగు నాకు సత్కార మాచరించి
సేవ లిటునేర్పుమని బోధసేయునేమొ॥

మునివరోద్గతోంకార నిస్వనము మోసి
గిరి గుహారణ్యములనెల్లc దిరిగి తిరిగి
హొరుమని మారుమ్రోగు నీమారుతములు
నాకు ధిక్కార మొసcగుచున్నవి నిజంబు॥

అలరు పూcదేనియలు రేకులంటకాని
తరులతా వీధిc బ్రణవ నాదములవెంట
మధురగానము సేయు నీమధుకరములు
నాకుc గర్తవ్యమొసcగుచున్నవి గదమ్మ॥

పావనములైన సెలయేటి జీవనములc
ద్రావి యందందు మెలcగు సారంగ వితతి
బెదరుc జూపుల ననుజూచి చెదిరిపోయె
నకట వానికి బోయ యిల్లాలనైతి॥

ఆకులలములుదిని తృప్తిననుదినంబు
నిండునియతిఁ దపోనిష్ఠనుండు తపసిఁ
గనిన నాకిట్టి వలపు పైకొనఁగనేల
దాని కాతని తపమాఁగు తమకమేల॥

ఇంద్రుఁ బ్రార్థింపనేల నాయిచ్చమెచ్చి
పోయిరమ్మని మఘవుఁడం పుటయునేల
నన్నుఁ బ్రాణంబుగాఁగొను సన్నుతాంగు
లందఱును మంచిదని సాగనంపుటేల॥

ఇదియెదో దైవలీల యీయదనుముట్టి
యెట్టి మేలుకీళ్ళిల ఫలియింపఁ గలవొ
యేది యెటులైనఁ గాము జయింపఁజాల
కోరిక నెటైన సాధించి తీరవలయు॥

ఏ మహాశక్తి ననుముట్టి యిట్టు సేసె
నా మహాశక్తి రక్షించి యాదరించి
నెమ్మిఁ దోడ్పడి కోర్కి పండించుగాక
కలుగుఁగా కొక్కమేలు నావలన భువికి॥

అని వితర్కించి మేనక మనమునందు
వింతభావ పరంపర రంతుసేయ
వలపు టురులకు మరుని తూపులకుఁజిక్కి
నడచెఁ దన మేనిసొంపు లామడలఁబర్వ॥

మించు వలపున ముని సమీపించు కొలఁది
మది తలంపులు చిగిరింప మరుఁడు నొంపఁ
దరులతా పుష్ప పవన బంభర శుకాది
మదన పరివారమునకు నమస్కరించి॥

శాంతి మాపెడి తరులార! శాంతిలేక
నా యెడఁద గ్రాఁగుచున్న దనాథనైన
నన్ను మీచల్వ నీడలో నడువనిచ్చి
మౌనివరుఁ జేర్పుఁడీ! మేలుమరువనెపుడు॥

అలరుఁ దీవియలార! మీయందమునకు
నాకు సామ్యమే యీమేను నవసియిట్లు
సన్న గాలికిఁ దూలిపోనున్న దిపుడు
విరుల బరువెత్తి యేల నవ్వెదరు తల్లి!

మలయ మారుతమా! నీవు చలువసామి
వేల ననుఁదాఁకి వెచ్చ నయ్యెదవు తండ్రి
నీకుఁ జలువయు బలముంట నిక్కమేని
కౌశికు సమాధిమాన్పి నన్ గాచికొమ్ము॥

ఓయి షట్పద! నీకు సవోద్గతములు
తేనె లిచ్చెదఁ గ్రావి నిద్రింపఁ బొమ్ము
పాటఁ బాడెదవా గాధి పట్టిచెంత
కరిగిపాడు మాతండు సంయమము బాయ॥

మదనవాహన ఏల కూసెదవె చిలుక
పలుకు నేర్పెద నీకు నే ఫలములిడెద
నొక్క సాయముఁజేయు నిన్నెక్కినపుడు
మరునిఁగొని పొమ్ము కుశిక కుమారుకడకు॥

అనుచు మేనక ఎదురుగా హాళ హాళించు
మదన పరివారమును బతిమాలి కొలిచి
తన్ను దీవింప వన దేవతలకు మ్రొక్కి
ధైర్యమున గాధిసుతుని ముందటికిఁ జనియె

సంయ మీశ్వరు దివ్య తేజమును జూడఁ
గనులు మిఱుమిట్లు గొన మేనుకంప మందఁ
బలుకు తడఁబడ మనసులో గలియబెట్టు
వలపు లౌకపాటగా నిట్లు పలుకఁ దొడఁగె.

ఓ మునీంద్ర కందర్ప! నీయురు తపః ప్ర
భావ ముగ్ధనై నినుఁగొల్వ వచ్చి యుంటి
దివ్య దృష్టితో నిది నీకుఁ దెలియకున్నె
కన్నులరవిచ్చి యొకసారి గనఁగదయ్య

మీ యశోవృక్ష మండగా నాయఖండ
రాగలత సాఁగి దెసల సౌరభము నిండఁ
బూలు పూచినఁ జాలు నాపున్నె ముబికి
ఫలము పండెనా యది మేలు పైని మేలు.

కలదు రూపము ప్రాయంబు కలికి తనము
దేవతా వాంఛనీయ మీ దీనురాలి
కీవు తేజస్వి వతనుఁడే దైవమైన
వెలితియే మున్న దిటు కనుల్ విచ్చవయ్య

అనెడు మేనక యాలాప మాలకించి
నిశ్చల సమాధి నున్న ముని ప్రవరుఁడు
లోని నాదము నుడిగి వెలుపలి గీతి
మరగి మదివిచ్చఁ గనువిచ్చి మగువఁజూచె.

చూచి నంత మెఱపుఁ దీవెఁ జూచినట్లు
కనులు మిఱుమిట్లు గొని యపాంగములు సెదరఁ
బెదవి చిఱునవ్వుతో మనః ప్రీతి తొలఁకి
వెలికి జాఱ నక్కలికి తోఁ బలికె నిట్లు

కువలయ దళాయతాక్షి! నీ వెవతె వెట్టి
జ్ఞాన సముపార్జనము సేయఁ గదలి యిటకు
నున్నతోన్నత శిఖరాల నుండి దుమికి
పరుగు లిడితివి సెలయేటి పడుచు వోలె.

పరువ ముడివోని దివిజ సుందరులఁ గూడి
యమర గంగలో నీఁదు రాయంచ వేమొ!
వేల్పుటెల దోఁటలోఁ బాడు పికము వేమొ!
నెఱుల పురివిప్పి యాడు నా నెమలి వేమొ!

ఆకసము నంటు గిరి తటు లావరించి
మించు జలదముల్ డిగివచ్చు మించు వేమొ!
యేమొ? యందుకో నీరాక యెఱుఁగ బల్కు
మబల! నా చేతనైన సాయమ్ముఁజేతు.

అనెడు వాక్సుధా నరసిలో మునిఁగి తేలి
తేరుకొని పల్కులోఁ గొంత తియ్యఁ దనము
చూపులో వింత చెలువు మైసొబగులో నొ
యార మొక్కింత వెలుఁగ నయ్యతివ పలికె.

"ఓ మునీంద్ర! యఖండ తేజో మయాత్మ!
నన్నెఱుంగని యట్లు మీరన్ననేమి!
మిమ్మెఱుఁగు లోకమెల్లఁ బంతమ్ము వట్టి
సృష్టికొక సృష్టి యొనరించు స్రష్టవనుచు.

నేను దేవేంద్రు కొల్వులో సానినంచు
నంగ విన్యాసముల నాట్యమాడి పాడి
స్వర్గవాసుల నానంద పరచునట్టి
మేనక నటంచు మిమ్మునమ్మింపఁ గలనె?

ఎఱుఁగరే నన్ను నా మన స్సరసిజమున
మలయు తావి నాఘ్రాణించు కలిమిలేదె!
ముక్కుమూసి యాంతరగంధములను బీల్చు
ఘనుల మీ కడ దాపరికమ్ము తగునె!

బట్ట బయలుగ నిలిచి నాగుట్టు తమకు
నప్పనము చేసికొందుఁ గొండంత పెరిగి
యెడఁద నిండిన యజ్ఞానమిదిగొ దీని
మీ కరస్పర్శఁ బుడికి పుల్మినను జాలు.

స్వర్గ సంవాసు లెల్ల నాపైఁట చెఱఁగు
సోఁకి ధన్యులైరఁట గాని నాకుఁ గలుగ
దాత్మలోఁ దృప్తి కడకు మిమ్మాశ్రయింప
నన్నుఁ బ్రేరేచి మరుఁడంపి నాఁడు సామి.

నిలుతు మీనీడ – మనసులో మెలఁగు కొందుఁ
బ్రేమమున మీయశోవల్లిఁ బెంచికొందుఁ
బొడముఁ గాత మనాఘ్రాత పుష్పమొకటి
యది మనకు లోకములకు నభ్యుదయ మగుత॥

అనెడు మేనకఁ గాంచి యా ముని కులేంద్రుఁ
డా నిలింప వధూటి యొయ్యారములకుఁ
బలుకుఁ దేనెల మఱుగు నేర్పులకు మెచ్చి
విచ్చుకొను డెందమును గప్పిపుచ్చి పలికె॥

"లెస్స పలికితివో లవలీ లతాంగి!
స్వర్గ ఫలమెల్ల నీ కటాక్షమ్మె నిజము
నన్నుఁ దొల్లింటి గాధి నందనుగఁ దలఁచి
వచ్చితివ యేమొ! యిది పొరపాటు తరుణి!

మనసు పొరాడి తపసు నాశనము చేసి
కొన్న ఘట్టాలు గలవు వాకొనఁగ నేల?
యిపుడు బ్రహ్మత్వ మాశించి యెద బిగించి
కూరు చున్నాఁడ; నిది చెడఁగొట్టఁ దలఁతె॥

ఓ యమాయకురాల! నీ వూరకున్న
నుండనీయరు సురలు నిన్నుబ్బఁజేసి
పంపఁగా వచ్చితివి నా తపంబుఁ జెఱుపఁ
బడఁతి! యా నీటికీ బేడలుడుక వింక॥

అనెడు మాటలకులికి యయ్యలరుఁ బోఁడి
భయచలిత చిత్తయై యిట్లు పలుకఁ దొడఁగెఁ
బాపము శమించుఁగాక తాపసవరేణ్య
సురల దోషంబులేదు మీచరణమాన॥

ఒక్కనాఁడది శుభకరమో యశుభమొ
మనసులో లగ్నమయ్యె మీమహితమూర్తి
అదియ బీజమై యంకురమై ప్రవృద్ధ
మై మనోరథ లత హృదయంబునిండె॥

ఓ మహామునీ! తపము చేయుదువు నీవు
నీ తపముచేత నేఁ గృశనైతి నేల?
అదియు నీ తోడి నాయభిన్నాత్మ వృత్తి
చూడు మెదఁజీల్చి యట నిన్ను జూపుదాన॥

ఒక్కచో దేహమాత్మ వేఱొక్క చోట
నిలువఁ గలవె? నిల్చిన మాత్రఫలముగలదె
తెలిసి తెలిసియుఁ గనుమూయు ధీరవరుల
కేమి చప్పఁగనేర్తుమయ్యా! మహాత్మ॥

విరహ వేదన సైరింప వెరవులేక
పరువులెత్తిన యింద్రియ పంచకంబు
తోడి యీ వ్యక్తి – యీ నన్నుఁ దొందరించి
అచ్చుకీడ్చిన మరుఁ – డపరాధు లిందు॥

నన్ను శిక్షింప రక్షింప నన్ని గతుల
మీరె చతురుః లీ మేనితో మేను సేర్చి
యైక్యమొదవింతురో; యాత్మనాత్మ తోడఁ
గలిపికొందురో యది భవత్కరగతంబు॥

ఎట్లయిగ నింకఁ గొదవలే; దీ త్వదీయ
దర్శనము వ్యర్థమునుగాదు; తప్పకొదవు
నొక్కచక్కని చుక్క మీయురు తపః ప్ర
భావ ఫలమున నానోము పంటగాఁగ॥

అందుకై నన్ను మీకు సర్వార్పణముగ
ధారవోసితి నా పుష్పధన్వు సాక్షి
మీనియతమైన ధ్యానావ సానవేళ
నెప్పుడో నన్నుఁ బనిగొను మింతచాలు॥

వలయు పరిచర్య లొనరింతు వలసి నపుడు
పదము లొత్తుదు సెజ్జగాఁ బైట చెఱఁగు
పఱచి మృదులో పధాన మీ బాహువల్లి
యిడి భజింతుఁ గటాక్షింపు మీ సపర్య॥

దీనురాల! భవత్కృపాధీనురాల!
దరియు జవరాల; మరునికిఁ దాళఁజాల
నేలు కొనఁగదే యంచు నయ్యింతి పవన
చలిత లతవోలె ముని పదాబ్జముల వ్రాలె॥